
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
శనివారం 20 జూలై 2024 | 5



నిండా.. ముంచేను!



అన్నదాతకు.. కన్నీళ్లు : కడియంలో నీట మునిగిన వరి చేలు.. కొవ్వూరులో ఎక్స్‌కవేటర్‌తో కాలువలో తూడు తొలగిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

పొలాలను ముంచెత్తిన వాన

- జిల్లా అంతటా చినుకు..వణుకు
- ఉప్పొంగుతున్న గోదావరి
- ఎర్రకాల్వ,కొవ్వాడ కాల్వల ఉధృతి
- ఎర్రకాల్వలో పడి మత్స్యకారుడి మృతి
- 7965 హెక్టార్లలో పంట మునక
- అన్నదాతకు ఆగని కన్నీళ్లు
- పర్యటించిన కలెక్టర్, మంత్రి
- రహదారులపై పారిన వరద
- ఆదుకుంటామన్న నాయకులు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

చినుకు వణికిస్తుంది.. నిండా ముంచేసింది.. ఎక్కడా తెరిపివ్వలేదు.. గత మూడు రోజులుగా వరుణదేవుడు వదల్లేదు.. జిల్లా వ్యాప్తంగా పంట చేలన్నీ నీట మునిగాయి.పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి.రోడ్లు చెరువులను తలపించాయి.చాలా గ్రామాల్లో ఊళ్లు..పొలాలు ఏకమయ్యాయి. జనజీవనం అస్తవ్యస్తమైంది. జిల్లా అంతా తడిచిముద్దయింది. మరో రెండు మూడు రోజుల పాటు భారీ వర్షాలు ఉండొచ్చని అధికారుల హెచ్చరికల నేపథ్యంలో జనం ఆందోళన చెందుతున్నారు. ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న వరద నీటితో గోదావరి ఉప్పొంగుతోంది.పోలవరం ఎగువ కాఫర్ డ్యామ్ వద్ద వరద నీరు తన్నిపట్టింది. స్పిల్‌వే గుండా రాజమహేంద్రవరం వైపు వరద నీటిని వదిలేస్తున్నారు. జంగారెడ్డిగూడెం ప్రాంతం నుంచి వచ్చే ఎర్రకాలువ పొంగడం వల్ల గోపాలపురం, నల్లజర్ల, నిడదవోలు నియోజకవర్గాల్లో అనేక ప్రాంతాలు నీట మునిగాయి. ఎర్రకాలువ, కొవ్వాడ కాలువలకు వరద నీరు పోటెత్తడంతో వేలాది ఎకరాల్లో వరి పొలాలు నీట మునిగాయి. చేలన్నీ గోదావరిలా మారాయి. దేవరపల్లి మండలంలో తాడిపూడి కాల్వ పొంగి ప్రవహించటంతో యర్నగూడెం, సుబ్బరాయపురం మధ్యలో తాడిపూడి కాల్వకు గండిపడింది. దీంతో యర్నగూడెం, సూర్యనారాయణపురం, త్యాజంపూడి గ్రామాల్లో వరినాట్లు ముంపునకు గురయ్యాయి. గురు వారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం 8.30 గంటల వరకూ జిల్లాలో 1922.2 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లాలో భారీ వర్షాలు,ఎర్రకాలువ, కొవ్వాడ కాలువ పొంగడం వల్ల 51 హెక్టార్లలో నారుమళ్లు, 7965.9 హెక్టార్లలో నాట్లు నీట మునిగినట్టు వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు తెలిపారు.18 మండలాల పరిధిలోని 178 గ్రామాల్లో 9613 మంది రైతుల పొలాలు మునిగాయన్నారు.

సీతానగరంలో అత్యధికం

రాజమహేంద్రవరం సిటీ, జూలై 19 : జిల్లాలో అల్పపీడన ద్రోణి ప్రభావంతో వర్షాలు పడుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 19 మండలాల్లో గురువారం రాత్రి నుంచి శుక్రవారం సాయంత్రం వరకూ మొత్తం 1922.2 మి.మీ వర్షపాతం నమోదైంది. అత్యధికంగా సీతానగరం మండలంలో 267.2 మి.మీ వర్షపాతం.. అత్యల్పంగా రాజానగరంలో 36.4 మి.మీ వర్షపాతం నమోదైంది. దేవరపల్లిలో 145.8 మి.మీ, నిడదవోలులో 137.8 మి.మీ, కడియంలో 114.6 మి.మీ, ఉండ్రాజవరంలో 109.6 మి.మీ, చాగల్లులో 107.6 మి.మీ, రాజమహేంద్రవరం రూరల్‌లో 104.8 మి.మీ, గోపాలపురంలో 103.6 మి.మీ, పెరవలిలో 101.4 మి.మీ, రాజమహేంద్రవరంలో 96.8 మి.మీ, తాళ్లపూడిలో 94.6 మి.మీ, నల్లజర్లలో 93.4 మి.మీ, కొవ్వూరులో 84.6 మి.మీ, అనపర్తిలో 78.2 మి.మీ, కోరుకొండలో 77.4 మి.మీ, బిక్కవోలులో 71.8 మి.మీ, రంగంపేటలో 53.4 మి.మీ, గోకవరంలో 43.2 మి.మీ వర్షపాతం నమోదైంది.



పోటెత్తిన గోదారి : ధవళేశ్వరం బ్యారేజీ వద్ద ఇలా..

- వివరాలు 7లో



నాడు.. నేడు ఇంతేగా : పెరవలి మండలం నడిపల్లికోటలో నీటమునిగిన నెం.2 పాఠశాల

రహదారి కట్..కట



సీతానగరం చీపురుపల్లి మధ్య ఉన్న రోడ్డుపై ఆరడుగుల లోతున పారుతున్న నీరు

సీతానగరం,జూలై 19 : రోడ్డుపై వెళుతున్న నీటిలో ద్విచక్ర వాహనంపై వెళుతూ ఒక యువకుడు బైక్‌తో సహా కొట్టుకుపోయాడు. సీతానగరం నుంచి చీపురుపల్లి మీదుగా కోరుకొండ వెళ్లే రోడ్డులో సీతానగరం చీపురుపల్లి మధ్య ఉన్న దిగుడు కల్వర్టు నీటితో నిండిపోయి రోడ్డుపై నుంచి నీరు పారుతోంది. సుమారు 6 అడుగుల దిగుడు ఉండే ఈ కల్వర్టు మీదుగా నీళ్లలో ద్విచక్రవాహనంపై వెళ్లే ప్రయత్నం చేసిన యువకుడు ప్రమాదవశాత్తు నీటిలో కొట్టుకుపోవడంతో స్థానికులు కాపాడారు. ద్విచక్ర వాహనం కనిపించలేదు. దీంతో ఆ రహదారిలో రాకపోకలు నిలిచిపోయాయి.. రాపాక నుంచి కోటికేశవరం మీదు గా కోరుకొండ వెళ్లే రహదారిలో రాపాక కేశవరం మధ్య బురదకాలువ నీరు రోడ్డెక్కడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ముగ్గుళ్ళ నుంచి కోరుకొండ వెళ్లే రోడ్డులో మునగాల వద్ద గతంలో గండిపడడంతో రాకపోకలు నిలిచిపోయాయి.



ఇసుక బంద్ : తీపర్రు ర్యాంప్ వద్ద నిలిచిన లారీ

నీటిలో తహశీల్దార్ ఆఫీస్

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 19 : రాజమహేంద్రవరంలోని అర్బన్ తహశీల్దార్ కార్యాలయం నీట మునిగింది. కార్యాలయం చుట్టూ వర్షపునీరు చేరడంతో పాటు కార్యాలయం లోపలకు దాదాపుగా మోకాలిలోతు నీరు రావడంతో రెవెన్యూ విధులకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. దీంతో కార్యాలయంలో పనిచేసే పరిస్థితులు లేక ఉద్యోగులంతా కార్యాలయం ఎదురుగా ఉన్న చిన్న వినాయకుడి గుడి వద్ద కూర్చుని నీరు ఎప్పుడు లాగుతుందా అని ఎదురు తెన్నులు చూశారు. ఒక మోస్తరు వర్షాలు కురిసినా అర్బన్ తహశీల్దార్ కార్యాలయంలోకి నీరు చేరుతుంది. గత కొన్నేళ్లుగా ఈ సమస్యను ఎదుర్కొంటున్నా పాలకులు పట్టించుకోవడం లేదు.



నీట మునిగిన రాజమహేంద్రవరం తహశీల్దార్ కార్యాలయం



ఆరంభమే వర్రీ : వేమగిరిలో నీట మునిగిన వరి చేలు



కాలువ కాదు : కంసాలిపాలెంలో ఎర్రకాల్వ ఉధృతికి నీటిలో పొలాలు



పంట..తంట : తాళ్లపూడి మండలం తిరుగుడుమెట్టలో నీట మునిగిన పొలాలు



తాడిపూడి కాల్వకు గండి : దేవరపల్లి మండలం యర్నగూడెం శివారులో పడిన గండి

నేడు పాఠశాలలకు సెలవు

రాజమహేంద్రవరం, జూలై19(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో భారీగా వర్షాలు కురుస్తున్న కారణంగా శనివారం జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలకు సెలవు ప్రకటించినట్టు డీఈవో కె. వాసుదేవరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ప్రకటన జారీ చేశారు.



నిడదవోలులో వరద బాధిత ప్రాంతాల్లో పర్యటిస్తున్న మంత్రి దుర్గేష్, కలెక్టర్ ప్రశాంతి, ఎస్పీ నరసింహ కిశోర్

గోదావరిలో వేటకు వెళ్లొద్దు : కలెక్టర్

కొవ్వూరు/నిడదవోలు, జూలై 19 : వరద ఉధృతి ఎక్కువగా ఉన్నందున గోదావరిలో చేపల వేటకు ఎవ్వరు వెళ్లవద్దని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. నిడదవోలు, కొవ్వూ రు,నల్లజర్ల, గోపాలపురం ప్రాంతాల్లో పర్యటించి పలు సూచ నలు చేశారు. ధవళే శ్వరం బ్యారేజి వద్ద 175 గేట్లు ఒక మీటరు పైకెత్తి 3,46,391 క్యూసెక్కుల వరదనీరు సముద్రంలోకి విడుదల చేసినట్టు తెలిపారు. కొవ్వూరు మండలం మద్దూరులంక గ్రామంలో శుక్రవారం వరద పరిస్థితిని కలెక్టర్, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ అధికారులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. గోదావరిలో వరద ఉధృతి ఎక్కువగా ఉందన్నారు. మద్దూరులంక గ్రామంలో బలహీనంగా ఉన్న గట్టును పరిశీలించి ఏటిగట్టుకు ముందస్తు జాగ్రత్తగా అడ్డుకట్టలు వేసి వరదనీటిని నియంత్రించాలన్నారు. వరద ఉధృతి తగ్గే వరకు మొదటి ప్రమాద హెచ్చరిక కంటే ముందుగానే పునరావాస కేంద్రానికి వచ్చి ప్రజలు సహకరించాలన్నారు. పంట పొలాల్లో నిలిచిన వర్షపునీటి బయటకు పంపే ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ముంపు ప్రాంతాలను గుర్తించి సమస్యల్లేకుండా చూడాలని ఆదేశించారు. జేసీ, తహశీల్దార్లతో కలిసి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ముంపు బాధిత ప్రాంతాల్లో అధికారులు పర్యటించి ఫొటోలు, వివరాలు ఎప్ప టికప్పుడు వాట్సప్ గ్రూపు ద్వారా షేర్ చేయాల న్నారు. పరిస్థితులకనుగుణంగా తహశీల్దార్లు, డిజాస్టర్ నిర్వహ ణలో కమాండెంట్‌గా విశిష్ట అధికారాలు కలిగి ఉంటారని స్పష్టంచేశారు.

ఇన్‌పుట్ సబ్సిడీకి చర్యలు : మంత్రి

ఎర్రకాలువ వరదనీటి ముంపు నివారణకు ఏటిగట్టు పటిష్టతకు శాశ్వత పరిష్కార దిశగా చర్యలు చేపడతామని రాష్ట్ర పర్యాటక,సాంస్కృతిక, సినిమా టోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. నిడదవోలు మండలంలోని కంసాలిపాలెం, శింగవరం,రావిమెట్ల గ్రామాల్లో నీట మునిగిన పంట పొలాలను శుక్రవారం మంత్రి కందుల దుర్గేష్, జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు పరిశీలిం చారు. రైతాంగానికి సీడ్ సబ్సిడీ మాత్రమే కాకుండా ఇన్‌పుట్ సబ్సిడీ రూ.6వేలు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి భారీ వర్షాలకు వరదలకు ఏర్పడిన నష్టాన్ని పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారన్నారు. జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్, సబ్ కలెక్టర్ శ్రీ వాత్సవ ఉన్నారు.

వేటకు వెళ్లిన మత్స్యకారుడి మృతి

నిడదవోలు, జూలై 19 : మత్స్యకారుడి వేసిన వల అతని కాలికే నీటిలో పడి మృతిచెందాడు. నిడదవోలు పట్టణం తీరుగూడెంకు చెందిన మత్స్యకారుడు గణసాల వెంకటేష్ (56)కు చేపల వేట జీవనాధారం. ఎర్రకాలువ వరద ఉధృతి ఎక్కు వగా ఉండడంతో శుక్రవారం ముంపు ప్రాంతంలో చేపలు పట్టేం దుకు వెళ్లాడు.ప్రమాదవశాత్తు నీట మునిగి మృతిచెందాడు. మృతదేహాన్ని నిడదవోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య పాపమ్మ,కుమారుడు శ్రీధర్, కుమార్తె మరియమ్మ ఉన్నారు.కుటుంబం పెద్ద దిక్కును కోల్పోవడంతో కన్నీటి పర్యంతమవుతున్నారు.మంత్రి కందుల దుర్గేష్, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు మృతుడి కుటుంబీకులను పరామర్శించారు.



జిల్లా జడ్జిని కలిసిన కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ, జూలై 19 : జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీతను జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన తరువాత ఆమెను కలవలేదు. ఈ నేపథ్యంలో శుక్రవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కలెక్టర్ కలిసి మొక్కను అందజేశారు.

పీఎం విశ్వకర్మ పథకంపై అవగాహన సదస్సు

రాజమహేంద్రవరం రూరల్, జూలై 19 : ప్రధాన మంత్రి విశ్వకర్మ పథకం ద్వారా స్వయం ఉపాధి కల్పించడంతో పాటు చేతి, కులవృత్తులు చేసుకునే వారికి సబ్సిడీతో కూడిన బ్యాంకు రుణాలు అందజేస్తారని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి కొండబాబు తెలిపారు. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాల మేరకు కలెక్టరేట్ ఆవరణలో గల నాక్ కార్యాలయంలో సమన్వయ శాఖల క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందితో సంబంధిత శాఖల అధికారులు పీఎం విశ్వకర్మ పథకం మార్గదర్శకాల అమలుపై ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పీవీకే.ప్రసాద్, ఎస్‌వీఎస్.ప్రసాద్, డీఎల్‌డీవో వీణాదేవి, టి.రాజేష్ పాల్గొన్నారు.

నేడే ఆర్యాపురం అర్బన్ బ్యాంక్ పోలింగ్

- 11 డైరెక్టర్ల పదవులకు ఎన్నిక
- ఒక డైరెక్టర్ పదవి ఏకగ్రీవం
- 3 నియోజకవర్గాలుగా ఎన్నికలు
- ఎస్‌కేవీటీ కళాశాలలో ఓటింగ్
- 74,585 మంది ఓటర్లు
- 54 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు
- 655 మంది సిబ్బంది
- రేపు లెక్కింపు..ఎల్లుండి చైర్మన్ ఎన్నిక



పోలింగ్ ఏర్పాట్లపై సమీక్షిస్తున్న ఎస్పీ కిషోర్

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ప్రతిష్ఠాత్మకమైన ఆర్యాపురం కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ పోలింగ్‌కు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నందం గనిరాజు సెంటర్‌లో ఉన్న ఎస్‌కేవీటీ కళాశాలలో శనివారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ పోలింగ్ నిర్వహించనున్నా రు. మొత్తం 74,585 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఎస్‌కేవీటీ ఇంగ్లీష్ మీడియం స్కూల్, ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాలలో 48 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. ఇతర ప్రాంతాలో 6 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. ఎన్నికల నిర్వహణకు 380 మంది సిబ్బందిని నియమించారు.200 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు.ఆదివారం కౌంటింగ్ నేపథ్యంలో 75 మంది సిబ్బందిని ఏర్పాటు చేసినట్టు ఎన్నికల అధికారి వి.కృష్ణకాంత్ తెలిపారు. మొత్తం బ్యాంక్‌కు 16 బ్రాంచిలు ఉన్నాయి. వాటిని మూడు బ్యాంక్ నియోజకవర్గాలుగా విభజించారు.బ్యాంక్‌కు 12 మంది డైరెక్టర్లు ఉంటారు. మొదటి నియోజకవర్గం రాజమహేంద్రవరం పరిధిలోనే ఉంది. ఇక్కడ 10 మంది డైరెక్టర్లను ఎన్నుకుంటారు. రెండో నియోజకవర్గంలో ఒకరే నామినేషన్ వేయడంతో అది ఏకగ్రీవమైన సంగతి తెలిసిందే.మూడో నియోజకవర్గం దివాన్‌చెరువు, విశాఖ, భీమవరం, గుంటూరు వంటి ఇతర ప్రాంతాలకు ఒక డైరెక్టర్ పదవి ఉంది. ఇక్కడ ముగ్గురు పోటీ పడుతున్నారు.పదేళ్ల తర్వాత జరుగుతున్న ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నారు. పోలింగ్ స్టేషన్ల వద్ద సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేశారు. పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. టీడీపీ జనసేన బీజేపీ కూటమి చైర్మన్ అభ్యర్థిగా చల్లా శంకరరావు, వైసీపీ నేతల మద్దతు ఉన్న ప్యానల్‌కు నందెపు శ్రీనివాస్ చైర్మన్ అభ్యర్థులుగా ఉన్నారు. మొత్తం 11 డైరెక్టర్ల పదవులకు 34 మంది పోటీ పడుతున్నారు. ఆదివారం ఓట్ల లెక్కింపు జరుగుతుంది.విజేతలైన డైరెక్టర్లు 22న కలిసి చైర్మన్‌ను ఎన్నుకుంటారు. ఈ మేరకు రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ కళాశాల ప్రాంగణంలో ఎన్నికల పోలింగ్‌కు సంబంధించి భద్రత ఏర్పాట్లను ఎస్పీ డి.నరసింహకిశోర్ స్వయంగా పరిశీలించి పోలీస్ అధికారులకు తగిన సూచనలు చేశారు. ఆయన వెంట డీఎస్పీ (ఎస్‌బీ) డి.ప్రభాకర్, డీఎస్పీ (సెంట్రల్ జోన్) విజయపాల్, ఇన్‌స్పెక్టర్ (ఎస్‌బీ) సూరి అప్పారావు, వన్‌టౌన్ సీఐ పుల్లారావు, త్రీటౌన్ సీఐ వీరయ్యగౌడ్ ఉన్నారు.



పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్లు చేసుకుంటున్న సిబ్బంది

పొగాకు కిలో రూ.380

ఆల్‌టైమ్ రికార్డు.. రైతుల ఆనందం



దేవర పల్లి, జూలై 19: పొగాకు ధరలు రికార్డు స్థాయిలో గణనీయంగా పెరుగుతున్నాయి. దేవరపల్లి పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం వేలం నిర్వహించగా అత్యధికంగా కిలో పొగాకు ధర రూ.380 రేటు పలికింది. రికార్డు స్థాయిలో ధర పల కడంతో రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తుంది. ఇప్పటి వరకూ సరాసరి కిలో పొగాకు రూ.366, కనిష్ఠ ధర రూ.251 పలికినట్టు వేలం నిర్వహణా ధికారి జీఎల్‌కే ప్రసాద్ తెలిపారు. ప్రపంచ మార్కెట్‌లో మన పొగాకు డిమాండ్ ఉండడం జింబాంబ్వే, బ్రెజిల్,వలు దేశాల్లో ఉత్పత్తి ఆగడంతో ధర పలుకుతుందని పొగాకు బోర్డు అధికారులు, రైతులు అంటున్నారు.

జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారిణిగా శశాంక



రాజమహేంద్రవరం అర్బన్, జూలై 19 : జిల్లా బీసీ వెల్ఫేర్ అండ్ ఎంపవర్‌మెంట్ అధికారిణిగా బి.శశాంక శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు రాజమహేంద్రవరంలోని జిల్లా కార్యాలయంలో ఆమె బాధ్యతలు తీసుకున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జిల్లాల విభజన జరిగినా ఆ తర్వాత తూర్పుగోదావరి జిల్లాకు పూర్తిస్థాయి బీసీ వెల్ఫేర్ అధికారిని నియమించలేదు. దీంతో అప్పటి నుంచీ రాజమహేంద్రవరం డివిజన్ సహాయ బీసీ వెల్ఫేర్ అధికారి సత్యరమేష్ ఇన్‌చార్జిగా వ్యవహరించారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన శశాంకను అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారి సత్యరమేష్, హాస్టల్ వెల్ఫేర్ అధికారులు సుబ్బారావు, కృపావరం, సత్యకుమారి తదితరులు అభినందించారు.


ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ గేట్లనుంచి దిగువకు ప్రవహిస్తున్న వరదనీరు


సీతానగరం మండలంలో నీటమునిగిన వరి పొలాలు


అల్లూరి జిల్లా చింతూరు మండలం మోతుగూడెంలో పొంగిపొర్లుతున్న సోకిలేరువాగు జలపాతం

ఉధృతంగా గోదావరి


కూనవరం మండలం వద్ద శబరి సీలేరు, గోదావరి నదుల సంగమ ఉధృతి

- కాటన్ బ్యారేజ్ 175గేట్లు 1మీటరు మేర ఎత్తివేత
- 3.46 లక్ష క్యూసెక్కులు సముద్రంలోకి
- పొంగుతున్న వాగులు, వంకలు
- భద్రాచలం వద్ద పెరుగుతున్న గోదావరి వరద

ధవళేశ్వరం, జూలై 19: గోదావరి పరివాహక ప్రాంతాల్లో విస్తారంగా కురుస్తున్న వర్షాల కారణంగా వరద ప్రవాహం గోదావరిలో కలుస్తుండడంతో గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎగువ నుంచి వరద నీరు వస్తుండడంతో కాటన్ బ్యారేజ్ వద్ద శుక్రవారం ఉదయం 175 గేట్లను 70మిల్లీమీటర్ల మేర ఎత్తి నీటిని దిగువకు విడుదల చేసిన అధికారులు సాయంత్రానికి ఒక మీటరు పైకి ఎత్తి 3,46,391క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. దీంతో ధవళేశ్వరం వద్ద నీటి మట్టం 7అడుగులుగా నమోదైంది. ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు గోదావరికి చేరుతుండడంతో ధవళేశ్వరం వద్ద నీటిమట్టం మరింత పెరిగి మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయిలో ప్రవహించవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఎగువున భద్రాచలం వద్ద 26అడుగుల వరకు వేగంగా పెరిగిన నీటి మట్టం ఆపై నెమ్మదించి శుక్రవారం సాయంత్రానికి 26.80అడుగులకు చేరుకుంది. ప్రస్తుతం పెరుగుదల నెమ్మదించినా ఎగువ నుంచి వస్తున్న వరద నీటితో 40 అడుగులకు పైగా నీటి మట్టం పెరగవచ్చని అధికారుల అంచనా.

ఏజెన్సీలో ఎడతెరిపి లేని వాన

- పరిస్థితిని సమీక్షిస్తున్న చింతూరు ఐటీడీఏ పీవో కావూరి

చింతూరు, జులై 19: అల్లూరి జిల్లా చింతూరు డివిజన్‌లోని చింతూరు, కూనవరం, వరరామచంద్రపురం, ఎటపాక మండలాల్లో శుక్రవారం రోజంతా ఎడతెరిపిలేని వర్షం కురిసింది. దీంతో వాగులు వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మండలంలో శుక్రవారం రోజంతా వర్షం కురిసింది. దీంతో శబరి ఉధృతి క్రమంగా పెరుగుతోంది. వాగులు వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. శుక్రవారం సాయంత్రం వరకు రాకపోకలకు ఎటువంటి అంతరాయాలు చోటుచేసుకోలేదు. భద్రాచలం వద్ద గోదావరి ఉధృతి 26.5 అడుగులకు చేరుకుంది. శనివారం నాటికి 30 అడుగుల నీటి మట్టానికి చేరుకోవచ్చన్న అంచనా ఉంది. ఎగువ రాష్ట్రాలైన ఛత్తీస్‌గఢ్, ఒడిస్సా సరిహ ద్దులలో కూడా వర్షం కురుస్తుండడంతో ఆ నీరంతా శబరిలోకి చేరి ఉధృతికి కారణంగా మారింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షం కారణంగా వ్యవ సాయ పనులు నిలచిపోయాయి. చింతూరు, వరరామచంద్రపురం మండ లాల నడుమ ప్రధాన రహదారిపై జల్లివారిగూడెంవాగు పొంగి ప్రవహిస్తుం


చింతూరు-వరరామచంద్రపురం మండలాల నడుమ ఉధృతంగా ప్రవహిస్తున్న జల్లేరుగూడెం వాగు

డడంతో దాదాపు నాలుగు గంటలపాటు ఆ దిశగా రాకపోకలు నిలిచిపోయాయి. సాయంత్రానికి వర్షం కాసింత తగ్గుముఖం పట్టడడంతో ఆటుగా రాకపోకలు పునరావృతమయ్యాయి. చింతూరు ఐటీడీఏ పీవో ఎప్పటికప్పుడు వరద ఉధృతిపై సమీక్ష చేస్తున్నారు. పొంగి ప్రవహిస్తున్న వాగుల వద్దకు అయన తన బృందంతో నేరుగా పరిశీలిస్తున్నారు. ఆ మేరకు తీసుకోవాల్సిన చర్యలపై ఆయన సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నారు. ఇప్పటికి వరద సహాయ చర్యల్లో భాగంగా బఫర్ స్టాక్ సిద్ధం చేశారు.

కోటిపల్లి ఫెర్రీ రేవులో రాకపోకలు బంద్

కె.గంగవరం, జూలై19: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం కోటిపల్లి-ముక్తేశ్వరం ఫెర్రీ రేవులో రాకపోకలు శుక్రవారం ఉదయం


కోటిపల్లి ఫెర్రీలో నిలిచిపోయిన పంట్లు

నుంచి నిలిపివేశారు. బంగాళాఖాతం అల్పపీడనం కారణంగాను, ఎగువ ప్రాంతా ల నుంచి గోదావరికి వస్తున్న వరదనీటి కారణంగా గోదా వరిలో ప్రవాహం ఉధృతంగా ఉంది. ఫెర్రీ రేవులో తాత్కాలిక రహదారి మునిగిపోవడంతో రాకపోకలు నిలిపి వేశారు. వరద ఉధృతి తగ్గిన తరువాత రాకపోకలు పునరుద్ధరిస్తామని ఎంపీడీవో ఎస్.శ్రీనివాస్ చెప్పారు.


అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలంలో నీటమునిగిన వరి పొలాలు


వరదనీటిలో ఉన్న పోశమ్మగండి అమ్మవారి ఆలయం

జలదిగ్బంధంలో గండిపోశమ్మ ఆలయం

దేవీపట్నం, జూలై 19: ఇటీవల కురిసిన వర్షాలకు గత వారంరోజుల నుంచి గోదావరి వరద నెమ్మనెమ్మదిగా పెరగడంతో మండలంలో ముంపు గ్రామాలతోపాటు మాతృశ్రీ గండి అమ్మవారి ఆలయాన్ని శుక్రవారం చుట్టుముట్టింది. దీంతో అమ్మవారి విగ్రహం మెడ భాగం వరకు వరదనీరు చేరింది. ఇదే వరద కొనసాగినట్లయితే శనివారం సాయంత్రానికి వరదనీరు అమ్మవారి గోపురాన్ని తాకే అవకాశముంది. ఎడతెరిపి లేకుం డా వర్షం కురవడంతో మండలంలో ప లు వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. పలు గ్రామాల ప్రజల రాకపోకలకు ఇబ్బందులకు గురవుతున్నారు. మరోపక్క వర్షంధాటికి నారుమడులు, పలు కూరగాయల పంటలు నీట మునిగాయి.

కోటసత్తెమ్మ ఆలయానికి తాకిన వరదనీరు


తిమ్మరాజుపాలెంలోని కోటసత్తెమ్మ ఆలయంలోకి ప్రవేశించిన వరదనీరు

నిడదవోలు, జూలై 19 : నిడదవోలు మండలం తిమ్మ రాజుపాలెంలో కోటసత్తెమ్మ దేవస్థానంలోకి వరదనీరు ప్రవేశించింది. కొద్దిరోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఎర్రకాలువ వరదనీరు దిగువకు విడుదల చేయడంతో అమ్మవారి దేవస్థానం వెనుకఉన్న కల్వర్టు ద్వారా అమ్మ వారి గర్భాలయంలోకి ప్రవేశించింది. అలాగే ఆలయ ఆవ రణలోని ధ్వజస్తంభం ప్రాంతంలో కూడా వరదనీరు ప్రవే శించింది. ఆలయ అధికార్లు ఆలయం లోపల నీటిని మో టార్ల ద్వారా బయటకు తోడించేలా చర్యలు చేపట్టారు. ఎర్రకాలువ ఎప్పుడు పొంగి ప్రవహించినా అమ్మవారి ఆలయంలోకి ప్రవేశిస్తోందని, సమస్య పరిష్కారానికి ప్రజాప్రతినిధులు అధికారులు శాశ్వత చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.

నేడు జడ్పీ స్థాయీ సంఘాల సమావేశం

కాకినాడ సిటీ, జూలై 19: ఈనెల 20వతేదీ శనివారం ఉదయం 10.30 గంటలకు కాకినాడలోని జడ్పీ సమావేశ మందిరంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశం జరుగుతుందని జడ్పీ సీఈవో ఎ.శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. జడ్పీ ఛైర్మన్‌తోపాటు ఆయా స్థాయి సంఘాల చైర్మన్ల అధ్యక్షతన స్థాయీసంఘాల సమావేశం జరుగుతుందన్నారు. సమావేశానికి ఆయా స్థాయీ సంఘాల్లో సభ్యులుగా ఉన్న ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరు కానున్నారని తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని సీఈవో తెలిపారు.

22న కాకినాడలో జాబ్‌మేళా

కాకినాడసిటీ, జూలై 19: ఈనెల 22న కాకినాడలోని వికాస కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు తెలిపారు. ఈ జాబ్‌మేళాలో వివిధ కంపెనీలు, సంస్థల్లో లోన్ ఆఫీసర్, ఫ్రంట్ ఆఫీస్ ఎగ్జిక్యూటివ్, ఎగ్జిక్యూటివ్, ట్రైనీ అకౌంటెంట్, అకౌంటెంట్, సర్వీస్ అడ్వయిజర్, హెల్పర్స్, టెక్నీషియన్, టెలికాలర్, సేల్స్ రిప్రజెంటేటివ్, అసిస్టెంట్ మేనేజర్, సూపర్‌వైజర్, కెమిస్ట్, టెక్నీషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, బీటెక్ ఉత్తీర్ణులైన 35ఏళ్లలోపు అభ్యర్థులు అర్హులన్నారు. వీరికి నెలకు రూ.12వేల నుంచి రూ.30వేలవరకు జీతం, ఇన్సెంటివ్స్, భోజనం వసతి, రవాణా ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు సోమవారం ఉదయం 9గంటలకు సర్టిఫికెట్ల జెరాక్స్‌లతో కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయం వద్దకు హాజరుకావాలన్నారు. సెల్:7799376111లో సంప్రదించాలన్నారు.

నేడు రామచంద్రపురంలో మెగాజాబ్ మేళా

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూలై 19: రామచంద్రపురం వీఎస్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం మెగాజాబ్‌మేళా నిర్వహించనున్నారు. జాబ్‌మేళాలో సాఫ్ట్‌వేర్, ఫార్మా, బ్యాంకింగ్, బి.పి.వో, టెక్నికల్ రంగానికి సంబంధించి 36 ప్రముఖ కంపెనీల్లో సుమారు 2366 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు వికాస ప్రాజెక్టు డైరెక్టరు కె. లచ్చారావు తెలిపారు. ఎన్‌క్లవెడ్ సర్వీసెస్, జెన్‌ప్యాకెట్, టెక్‌మహీంద్రా, ఎంఎస్‌సీ ఐటీ, ఓషన్‌యాప్స్‌టెక్నాలజీస్, బి.ఎస్.సి.పి.ఎల్, నిట్, ఐసిఐసిఐ బ్యాంకు, కోజెంట్ ఇ సర్వీసెస్, ఇండిగో ఎయిర్ లైన్స్, హొండాయ్ మెటీస్, డెక్కన్ కెమికల్స్ తదితర సంస్థల్లో వివిధ ఉద్యోగాలకు అవకాశం కల్పిస్తామన్నారు. ఉద్యోగాలకు ఎస్ఎస్‌సీ నుంచి పీజీ వరకు ఉత్తీర్ణులైన 35 ఏళ్లలోపు వయస్సుగల అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఉద్యోగాలను బట్టి రూ 13 వేల నుంచి 60 వేలు వరకు వేతనం ఉంటుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఉదయం 9 గంటలకు అర్హత సర్టిఫికెట్స్ జెరాక్స్‌లతో హాజరుకావాలని కోరారు.

జేఎన్టీయూకే అభివృద్ధికి కృషిచేస్తా

- ఇన్‌ఛార్జి ఉపకులపతిగా బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ మురళీకృష్ణ

జేఎన్టీయూకే, జూలై 19: కాకినాడ జేఎన్టీయూకే అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఇన్‌ఛార్జి ఉపకులపతిగా బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ అన్నారు. విద్యార్థులకు విలువలతో కూడిన విద్యనందించడంతోపాటు కాలానుగుణంగా ఇంజనీరింగ్ విద్యలో వస్తున్న మార్పులను అనుసరించి బోధన ఉండేలా ప్రణాళిక చేపడతామన్నారు. వర్సిటీ ఇన్‌ఛార్జి వీసీగా తనకు అవ కాశం కల్పించిన సీఎం చంద్రబాబునాయుడు, విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్, ఉన్నత విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి సౌరబ్‌గౌర్, ఉన్నత విద్యామండలి ఇన్‌ఛార్జి చైర్మన్ రామ్మోహన్‌రావులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి వీసీగా బాధ్యతలు చేపట్టిన మురళీకృష్ణకు మాజీ ఉపకులపతులు, వర్సిటీ అధికారులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందనలు తెలిపారు. అనంతరం ఏపీపీఎస్సీ మాజీ చైర్మన్ పి.ఉదయ్‌భాస్కర్, మాజీ ఉపకులపతులు జీవీఆర్ ప్రసాదరాజు, శ్రీనివాసకుమార్, పద్మరాజు, రిజిస్ట్రార్ సుమలత, మాజీ రిజిస్ట్రార్‌లతో ఇన్‌ఛార్జి వీసీ సమావేశం


మురళీకృష్ణను అభినందిస్తున్న ఏపీపీఎస్సీ మాజీ చైర్మన్ ఉదయ్‌భాస్కర్, మాజీ వీసీలు

నిర్వహించి విశ్వవిద్యాలయ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో డైరెక్టర్లు, ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

వేటకు వెళ్లిన మత్స్యకారుడు మృతి


మృతిచెందిన మత్స్యకారుడు రాంబాబు

మామిడికుదురు, జూలై 19: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం కరవాక గ్రామంలోని గంగాపురం కాలనీకి చెందిన మత్స్యకారుడు కొప్పనాతి రాంబాబు (38) వేటకు వెళ్లి శుక్రవారం మృతి చెందాడు. చేపలు పట్టేందుకు విసిరిన వల గాలికి తిరిగి మీద పడడంతో వలలోచిక్కుకుని ఉప్పుటేరులో పడి మునిగి మృతి చెందినట్టు నగరం ఎస్ఐ పి.సురేష్ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడి మృతి

గొల్లప్రోలు, జూలై 19: కాకినాడజిల్లా గొల్లప్రోలులో వృద్ధుడు అనుమానాస్పద స్థితిలో మరణించాడు. పట్టణంలోని కొత్తపేటకు చెందిన కర్రి వెంకటేశ్వరరావు(70) 18వ తేదీ మధ్యాహ్నం ఇంటికి వచ్చాడు. బయట పని ఉందని చెప్పి సాయంత్రం 6గంటలకు వెళ్లి తిరిగి రాలేదు. ఫోన్‌చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చింది. ఎక్కడ వెతికినా కనిపించలేదు. శనివారం ఉదయం వార్డు సచివాలయం-5 వద్ద గల డ్రెయిన్‌లో పడి వెంకటేశ్వరరావు చనిపోయి ఉండగా స్థానికులు గుర్తించారు. దీనిపై అతని భార్య కర్రి నాగమణి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన భర్త మృతికి గల కారణాలు తెలుసుకోవాలని కోరారు. దీనిపై బీఎన్ఎస్ఎస్ యాక్ట్ 194 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జానీబాషా తెలిపారు.

గోకవరం పోలీసులు నన్ను హింసించారు

- జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వ్యక్తి ఆరోపణ
- ఎస్పీకి ఫిర్యాదు చేసినట్టు వెల్లడి



రాజమహేంద్రవరం అర్బన్, జూలై 19 : గోకవరం ఎస్ఐ తనపై దౌర్జన్యం చేసి దుర్భాషలాడారని గోకవరం మండలం మల్లవరం గ్రామానికి చెందిన ఇంటి సూర్యచంద్ర అనే వ్యక్తి ఆరోపించారు. ఈ మేరకు రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న సూర్యచంద్ర శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 11వ తేదీన మల్లవరంలో తన పక్కింటివారితో తలెత్తిన వివాదంపై గోకవరం పోలీసులను ఆశ్రయిస్తే బాధితుడినైన తనపైనే దౌర్జన్యం చేశారని తెలిపాడు. ఈ విషయంపై జిల్లా ఎస్పీ, డీఎస్పీలకు ఫిర్యాదు చేయడం జరిగిందని, తనకు న్యాయం చేయాలని కోరారు.

అగ్నివీర్‌లో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల

రంపచోడవరం, జూలై 19: అగ్నివీర్ పథకంలో భాగంగా భారత వాయుసేనలో ఉద్యోగాల నియామకానికి నోటిఫికేషన్ విడుదలైందని గిరిజన సంక్షేమశాఖ ఉపసంచాలకులు శుక్రవారం తెలిపారు. అభ్యర్థులు జూలై-2004 నుంచి జనవరి -2008 మధ్య జన్మించి ఉండాలని, ఇంటర్ ఒకేషనల్, పాలిటెక్నిక్‌లో 50శాతం మార్కులతో ఉత్తీర్ణత పొంది ఉండాలన్నారు. ఈనెల 28 తేదీ లోగా http://agnipathvayu.in వెబ్‌సైట్లో దరఖాస్తు చేసుకోవాల

మత్స్యకారులకు చిక్కిన పండుగొప్పలు

అంతర్వేది, జూలై 19: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది పల్లిపాలెంలో మినీ ఫిషింగ్ హార్బర్‌లో వివిధ ప్రాంతాలకు చెందిన మత్స్యకారుల వలలకు శుక్రవారం అధిక సంఖ్యలో పండుగొప్ప చేపలు దొరికాయి. సాగరసంగమం తీరాన మత్స్యకారులు వేటాడారు. ఎర్ర నీరుకు ఎదురీదుతున్న పండుగొప్ప చేపలు మత్స్యకారుల వలలకు చిక్కాయి. పల్లెపాలెంలో మినీ ఫిషింగ్ హార్బర్‌లో మత్స్యకారులు వాటిని విక్రయించారు. కొనుగోలుదారులు పాట పాడుకున్నారని, రూ.లక్షల్లో ఆదాయం వచ్చిందని మత్స్యకారులు ఆనందం వ్యక్తం చేశారు. కిలో రూ.500 చొప్పున విక్రయించినట్టు చెప్పారు. సుమారు రూ.2.50లక్షలు వచ్చినట్టు వారు తెలిపారు.


అంతర్వేది పల్లిపాలెంలో మత్స్యకారులకు దొరికిన పండుగొప్పలు

ఒడిసా మహిళ హత్య కేసులో భర్తే నిందితుడు

సర్పవరం జంక్షన్, జూలై 19: ఒడిస్సా వివాహిత హత్య కేసును పోలీసులు ఛేదించారు. అగ్నిసాక్షిగా వివాహం చేసుకున్న భర్తే హత్య చేసినట్లు నిర్ధారించి నిందితుడ్ని అరెస్ట్‌చేసి కోర్టుకు తరలించారు. సర్పవరం పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపిన వివరాల మేరకు ఒడిస్సా గంజాం జిల్లా కూలంగి గ్రామానికి చెందిన రితంజలి స్వైయిన్ (30) భర్త మీలు స్వైయిన్‌లు కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం సర్పవరం శివారు భావనారాయణపురంలో నివాసం ఉంటున్నారు. ఈనెల 16వ తేదీన భార్య రితంజలి స్వైయిన్‌ని హత్యచేసి కుమారుడుతో పరారయ్యాడు. మృతురాలి సోదరి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేశామన్నారు. నిందితుడు మీలు స్వైయిన్ సర్పవరం ఆటోనగర్‌లో సంచరిస్తూండగా శుక్రవారం మధ్యాహ్నం అరెస్ట్ చేసినట్లు ఎస్‌హెచ్‌వో వైఆర్కే శ్రీనివాస్ తెలిపారు. మద్యానికి వ్యసన పరుడై, శారీక కోర్కె తీర్చాలని భార్యను కోరగా తిరస్కరించడంతో కోపంతో భార్యను కొట్టి కిందపడేసి, నేలకు బుర్రను గుద్ది హత్య చేసినట్లు నిందితుడు అంగీకరించాడని అన్నారు. నిందితుడిని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

ఆత్యాచార నిందితుడి అరెస్ట్

- రిమాండ్‌కు తరలింపు

ఎటపాక, జూలై19: నాలుగేళ్ల చిన్నారిపై అత్యాచారానికి పాల్పడిన అమరవరపు రాము అనే నిందితుడిని శుక్రవారం ఏఎస్పీ రాహుల్ మీనా అరెస్ట్ చేశారు. మండలంలోని ఓ గ్రామంలో నిందితుడిని అరెస్ట్‌చేసి రంపచోడవరం కోర్టుకు రిమాండ్‌కు పంపారు. మండలంలోని ఓ గ్రామంలో ఈనెల 10న నాలుగేళ్ల చిన్నారిపై నిందితుడు అఘాయిత్యానికి పాల్పడిన విషయం విదితమే.

గ్రామాల్లో సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు కృషి

- ఈటీసీ ప్రిన్సిపాల్ వేణుగోపాల్

సామర్లకోట, జూలై 19: ప్రణాళికాబద్ధంగా గ్రామాలలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు అధికారులు కృషి చేయాలని ఈటీసీ ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ పేర్కొన్నారు. శుక్రవారం సామర్లకోట విస్తరణ శిక్షణా కేంద్రం ఆవరణలో జిల్లాస్థాయి మాస్టర్ లెవెల్ (డీఎల్ఎంటీ) శిక్షణార్థులకు మూడు రోజుల శిక్షణా తరగతులలో భాగంగా రెండోరోజైన శుక్రవారం ప్రిన్సి పాల్ వేణుగోపాల్ హాజరయ్యారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ గ్రామాలలో పేదరిక నిర్మూల నకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న కృషికి అనుగుణంగా క్షేత్రస్థాయిలో పంచాయతీలు సంపద సృష్టించే కేంద్రాలుగా రూపుదిద్దుకో వాలని ప్రిన్సిపాల్ వేణుగోపాల్ అన్నారు. అనంతరం వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమోహన్ మాట్లాడుతూ శిక్షణలు పొందిన డీఎల్ఎంటీలు జిల్లా స్థాయిలో గ్రామాల నుంచి ఎంపిక చేసిన వారికి శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఈ శిక్షణా తరగతులు తొమ్మిది రోజులపాటు జరుగనుండగా శ్రీకాకుళం నుంచి ఏలూరు జిల్లాల వరకూ 11 జిల్లాల నుంచి మూడు బ్యాచ్‌లుగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణలో చైల్డ్ ఫ్రెండ్లీ విలేజి, వాటర్ సఫిసీమెంట్ విలేజ్‌లుగా మూడు బ్యాచ్‌లుగా విభజించి శిక్షణా తరగతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. జిల్లాలో వివిధ శాఖలకు చెందిన జిల్లాస్థాయి అధికారులకు ఈ శిక్షణా తరగతులకు హాజరుకాగా వివిధ అంశాలపై ఫ్యాకల్టీలు జీవీ శ్రీదేవి, పి.శ్రీనివాసరావు, వి.ప్రసాద్‌లు వివరించారు. రెండో రోజు శిక్షణా తరగతులకు వివిధ జిల్లాలకు చెంది ఎడ్యుకేషన్, సోషల్ వెల్ఫేర్, హౌసింగ్, డ్వామా, వ్యవసాయ, పంచాయతీ రాజ్‌శాఖలకు చెందిన అధికారులను డీఎల్ఎం టీలుగా ఎంపికైన శిక్షణా తరగతులకు 70 మంది హాజరయ్యారు

నర్సింగ్‌పేటలో గిరిజనుడి అదృశ్యం

- పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు

ఎటపాక, జూలై19 : ఎటపాక మండలం రాంగోపాలపురం పంచాయతీ పరిధిలో నర్సింగ్‌పేట గ్రామానికి చెందిన కొర్సా కామేశ్వరరావు అదృశ్యమైనట్లు శుక్రవారం ఎటపాక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈనెల17న కామేశ్వరావువేటకు వెళుతున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లాడని, మూడు రోజులు గడుస్తున్నా ఇంటికి రాలేదని భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. దాంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్‌హెచ్‌ఎం సిబ్బందికి రీడిప్లాయిమెంట్ ఇవ్వాలి

- నేషనల్ హెల్త్ మిషన్ జాయింట్ యాక్షన్ కమిటీ

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 19 : నేషనల్ హెల్త్ మిషన్‌లో ఎన్‌సీడీ, సిమాంక్, ఎన్‌బీఎస్‌యూ, హెచ్‌డీఐసీయూ విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు వారు పనిచేసే ఆసుపత్రుల్లో ఉన్న ఖాళీల్లో, ఆ తర్వాత ఉమ్మడి జిల్లాలో ఉన్న ఖాళీల్లో వెంటనే రీడిప్లాయిమెంట్ చేయాలని నేషనల్ హెల్త్ మిషన్ జేఏసీ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు జేఏసీ నాయకులు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ఏడాది జూన్‌లో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు కమిషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్, మిషన్ డైరెక్టర్ ఇచ్చిన ఉత్తర్వులను జిల్లాల అధికారులు అమలు చేయకుండా ఇబ్బందిపెడుతున్నారన్నారు. వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వెంటనే జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

వీవీమెరకలో గోధుమ తాచు హల్‌చల్

అంతర్వేది, జూలై 19: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం వీవీమెరక గ్రామం పెన్నుల కంపెనీ రోడ్డులో శుక్రవారం గోధుమ తాచుపాము హల్‌చల్ చేసింది. ఉదయం కదలకుండా ఒకేచోట ఉండడంతో జనం గోధుమతాచును చూసేందుకు ఎగబడ్డారు. ఇంత పెద్ద పామును చూసి తొలుత గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. ఆరు అడుగులు పొడవు ఉన్న ఈ గోధుమ తాచుకు పలువురు పూజలు చేయడం విశేషం. ఈ తాచుపామును స్నేక్ క్యాచర్ వర్మ చాకచక్యంగా పట్టుకున్నారు.



వ్యక్తిపై డ్రింక్ బాటిల్‌తో దాడి

- నిందితుడి అరెస్టు.. రిమాండ్

కడియం, జూలై 19: కడియం మండలం మాధవరాయుడుపాలెం శివారు చైతన్య నగర్ దుర్గ ఆలయం సెంటర్ వద్ద ఈనెల 18న ముంజేటి సురేష్ అలియాస్ కాళీ, అనే వ్యక్తి మద్యం తాగి ఆ బాటిల్‌ను సెంటర్‌లో రోడ్డుపై పగులగొట్టాడు. పలువురు నడిచే దారిలో పగుల గొట్టడం ఏమిటని సురేష్‌ను పలువురు వారించగా వారిని ధిక్కరిస్తూ మాట్లాడుతున్న సమయంలో వార్డుమెంబర్ బళ్ల ధనుంజయరాజు కూడా వారించే ప్రయత్నం చేశాడు. దీంతో అతనిపై సురేష్ తిరగబడి పక్కనే ఉన్న బడ్డికొట్టులో డ్రింక్ బాటిల్‌ను పగులగొట్టి తిరగబడ్డాడు. దీంతో ధనుంజయ వీపు వెనుక, మోకాలుపై గాయాలు కాగా, కడియం సీహెచ్‌సీకి తరలించారు. బాధితుడు స్టేట్‌మెంట్ ప్రకారం సౌత్‌జోన్ డీఎస్పీ ఎం.అంబికాప్రసాద్ ఘటనాస్థలాన్ని పరిశీలించి బాధితులతో మాట్లాడారు. ఎస్ఐ కృష్ణసాయి కేసు నమోదుచేసి సురేష్‌ను శుక్రవారం అరెస్టు చేశారు. కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్టు పోలీసులు తెలిపారు. కాగా సురేష్‌పై 2022లో బొమ్మూరు పోలీస్‌స్టేషన్‌లో దొంగతనం కేసు, 2021లో రాజానగరం పోలీస్‌స్టేషన్‌లో కొట్లాట కేసు, కడియం పోలీస్‌స్టేషన్‌లో 2022లో, 2023లో కొట్లాట కేసులు ఉన్నట్టు డీఎస్పీ తెలిపారు.

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ఏజెన్సీ సమాచారం

వీడని వాన..

● భద్రాచలం వద్ద పెరుగుతున్న గోదావరి వరద


ఇంటి వసారులో కూలీన పైకప్పు

ఎటపాక, జూలై 19: ఏజెన్సీలో గత ఐదారు రోజులుగా వాన వీడడంలేదు. రోజంతా వర్షం పడుతూ ఉండడంతో జనజీవనం స్తంభిస్తోంది. భారీ వర్షాల దాటికి రహదారులు దెబ్బతిని, కల్వర్టు ప్రాంతాల్లో ప్రయాణించేందుకు వీల్లేకుం డా వరదనీరు ప్రవహిస్తోంది. గోదావరి ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో వరదపోటు పెరుగుతోంది. ఈనేపథ్యంలో శుక్రవారం సాయంత్రానికి భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 27 అడుగులతో ప్రవహిస్తోంది. ఇది కాస్త పెరిగే అవకాశాలు ఉన్నట్లు అంచనాలు వెలువడుతున్నాయి. అయితే వరదపోటు మండలంలో పలు వాగుల్లో చేరింది. వాగుల్లోకి వరదనీరు వచ్చి చేరుతోంది. దాంతో వాగులు పొటెత్తుతున్నాయి. భారీ వర్షాలతో విలీన మండలాల వాసులను గోదావరి వరదభయం వెంటాడుతోంది. మరోవైపు గోదావరి వరదతో ఎలాంటి ముప్పు ఉంటుందో అని విలీనవాసులు భయందోళన చెందుతున్నారు. వరద ఎంత మేర వస్తుందనేది ఎప్పటి కప్పుడు సామాజికమాధ్యమాల్లో తెలుసుకుంటూ అప్రమత్తమవుతున్నారు. కాగా ఐదారు రోజులుగా కురుస్తున్న వర్షాలకు త్రిపురపెంటవీడు పంచాయతీలోని సీతాపురం గ్రామంలో గొళ్లపల్లి రమణయ్యకు చెందిన పెంకటిళ్లు దెబ్బతిని, ఇంటివసారు భాగంలో కూలిపోయింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

పొంగిపొర్లుతున్న వాగులు


నెల్లిమెట్ల-లబ్బర్తి గ్రామల మధ్య రోడ్డుపై కొండవాగు

రాజవొమ్మంగి జూలై 19: గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి రాజవొమ్మంగి మండలంలో కొండవాగులు పొంగిపొర్లుతున్నాయి. కొండవాగులు ఉగ్రరూపం దాల్చి రహదారులపై ప్రవహిస్తుండడంతో మండలంలో అనేక గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. నెల్లిమెట్ల-లబ్బర్తి గ్రామల మధ్య, వట్టిగెడ్డ - ఎర్రంపాడు గ్రామాల మధ్య ఆర్‌అండ్‌బీ రహదారిపై ఉన్న సప్టలపై కొండ వాగులు ఉగ్రరూపం దాల్చి ప్రవహించడంతో సుమారు 20గ్రామల ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు.

వాగుల్లో దిగి ప్రాణాలపైకి తెచ్చుకోవద్దు-సీఐ

రోడ్లపై ఉధృతంగా వాగులు ప్రవహిస్తున్నపుడు ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాలలో ప్రయాణం చేయాలని రాజవొమ్మంగి సీఐ సన్యాసినాయుడు సూచించారు. శుక్రవారం మండలంలోని నెల్లిమెట్ల, ఎర్రంపాడు గ్రామాలవద్ద వాగుల ఉధృతిని ఆయన పరిశీలించారు. ప్రతిచోటా ఇద్దరు కానిస్టేబుళ్లను ఉంచి ప్రజలు వాగుపై నుంచి ప్రయాణం చేయడాన్ని సీఐ నిలిపివేశారు.

వాగులో కొట్టుకుపోయి పాడిగేదె మృతి



రాజవొమ్మంగి గ్రామానికి చెందిన పెదిరెడ్ల సత్యనారాయణ పాడిగేదె వాగు ఉధృతికి కొటుకోని వెళ్లి శాంతినగర్ బ్రిడ్జి వద్ద గేదె తలకిందకు వెళ్లి మృతి చెందింది. మృతి చెందిన పాడిగేదె సుమారు 70వేల రూపాయలు విలువ చేస్తుందని స్థానికులు తెలిపారు. టీడీపీ మండలాధ్యక్షుడు గొల్లపూడి పెద్దిరాజు సంఘటన స్థలానికి వెళ్లి సత్యనారాయణను పరామర్శించారు.

వరదల పట్ల అప్రమత్తంగా ఉండండి

కూనవరం, జూలై19: వరదలు వస్తే ప్రజలకు అందుబాటులో ఉండాలని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు శరవేగంగా తరలించాలని చింతూరు ఐటీడీఏ పీవో చైతన్య అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన వరదలపై అధికారులు, ప్రజా ప్రతినిధులు నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో బఫర్ స్టాక్ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మురళీకృష్ణ, ఎస్ఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన రైతుల అభివృద్ధికి చర్యలు: ఐటీడీఏ పీవో


రైతులకు మొక్కలు పంపిణీ చేస్తున్న పీవో

రంపచోడవరం, జూలై 19: గిరిజన ఉద్యానవన పంట రైతులను అభివృద్ధి చేసే విధంగా చర్యలు తీసుకుంటామని ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక హెచ్ఎన్‌టీసీలో రైతులకు జీడి మామిడి, జాఫ్రా మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ఉపాధిహామీ పథకం ద్వారా ఏజెన్సీ ఏడు మండలాల్లో సుమారు 2500 ఎకరాలకు జీడిమామిడి, దబ్బా, బత్తాయి, నిమ్మ, కొబ్బరి, మునగ, డ్రాగన్‌ఫ్రూట్, చింత తదితర మొక్కలు పంపిణీ చేశామన్నారు. మొక్కల సంరక్షణకు ఉపాధి హామీ ద్వారా సొమ్ములు చెల్లిస్తామన్నారు. ఉపాధి ఏపీడీ జి.శ్రీనివాస్, ఎంపీపీ బంధం శ్రీదేవి, జెడ్పీటీసీ పండా వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ కొమ్మిశెట్టి బాలకృష్ణ, సర్పంచ్ మంగా బొజ్జయ్య, ఏపీవో సత్యనారాయణ, టీప వీరన్న పాల్గొన్నారు.

నేడు పాఠశాలలకు సెలవు

మోతుగూడెం, జూలై19: అల్పపీడన ప్రభావంతో విస్తారంగా కురుస్తున్న వర్షాలకు వాగు లు పొంగి పొర్లుతుండటంతో అల్లూరి జిల్లాలో పాఠశాలలకు విద్యా శాఖ శనివారం సెలవు ప్రకటించింది.

కూనవరం ఎంపీడీవోగా లక్ష్మీరెడ్డి

కూనవరం, జూలై19: కూనవరం ఎంపీడీవోగా లక్ష్మీరెడ్డిని నియమించారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఎంపీడీవో సెలవుపై వెళ్లడంతో ఈయన బాధ్యతలు స్వీకరించారు. రానున్న వరదలను దృష్టిలో పెట్టుకుని శరవేగంగా లక్ష్మీరెడ్డిను నియమించారు.

అన్నవరం చప్టాను పరిశీలించిన ఐటీడీఏ పీవో

వరరామచంద్రాపురం, జూలై 19 : మండలంలోని అన్నవరం చప్టాను ఐటీడీఏ పీవో కావూరి చైతన్య శుక్రవారం పరిశీలించారు. గురువారం కురిసిన భారీ వర్షానికి అన్నవరం చప్టా ఉదయం నుంచి రాత్రి 10గంటల వరకు ప్రవహించింది. ఈక్రమంలో చప్టా కింది భాగంలో కొట్టుకుపోయిన మట్టి కారణంగా గుంతలు ఏర్పడ్డాయి. వెంటనే గుంతలను పూడ్చి వేయాలని ఆర్అండ్‌బీ అధికారులను పీవో ఆదేశించారు. అనంతరం పోచవరం వెళ్లే ప్రధాన రహదారిలోని గుట్టల పైనుంచి జారిపడిన మట్టిని రాళ్లను ఎక్స్‌కవేటర్‌తో తొలగిస్తున్న పనులను పరిశీలించారు. కార్యక్రమంలో తహశీల్దార్ సయ్యద్ మౌలానాఫాజిల్, రేఖపల్లి సర్పంచ్ పూనెం సరోజిని పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాల ఏర్పాటు

వరరామచంద్రాపురం, జూలై 19: ఏఎస్‌డీఎస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సీడీఆర్ వారి సహకారంలో మండలంలో రైతుసేవా కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు సంస్థ డైరెక్టర్ వి.గాంధీబాబు తెలిపారు. శుక్రవారం ఏఎస్‌డీఎస్ కార్యాలయంలో రేఖపల్లి క్లస్టర్‌కు సంబంధించి ఎఫ్‌పీవో సభ్యులకు 5 లక్షల రూపాయల విలువగల వ్యసాయ పనిముట్లను రిటైర్డ్ ఐఏఎస్ అధికారి మనోహర్ ప్రసాద్ అందజేశారు. కార్యక్రమంలో రవి, క్లస్టర్ రైతులు, ఎఫ్‌పీవో సభ్యులు సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

1/70 చట్టానికి విరుద్ధంగా వేసిన ఇంటి సైట్లను తొలగించాలి

దేవీపట్నం, జూలై19: ఇందుకూరు గ్రామంలో సర్వే నెంబర్ 244లో ఉన్న చెరువు భూమిని మట్టితో కప్పిపెట్టేసి 1/70 చట్టానికి విరుద్ధంగా ఇళ్ల స్థలాలకు సైట్లు వేసిన దాన్ని తక్షణమే రద్దు చేసి కారకులైన వారిపై శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని దేవీపట్నం తహసీల్దార్ చలపతిరావుకు శుక్రవారం కొండ దొరల సంఘం జిల్లా నాయకులు యలగాడ నాగేశ్వరరావు, ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్‌చైర్మన్ తెల్లంశేఖర్ వినతి పత్రం అందించారు. కొండ దొరల సంఘం నాయకులు దూసరి హరిబాబు, టెంకీ రాంబాబు, ఈరేటి వరలక్ష్మి, ఈరేటి కృష్ణమూర్తి, మన్నేపల్లి నాగేంద్ర, మూలపర్తి సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

రోడ్డుకు అడ్డంగా పడిన భారీ వృక్షం

రంపచోడవరం, జూలై 19: గత రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలోని నడివీధికి వెళ్లే మార్గంలో భారీ చింతచెట్టు రోడ్డుకు అడ్డంగా పడిపోయింది. స్థానికులు ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవికి సమాచారం ఇవ్వడంతో టీడీపీ శ్రేణులు జేసీపీ సాయంతో వృక్షాన్ని తొలగించారు. టీడీపీ నాయకుడు సలాది బాపిరాజు, గ్రామ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

ముంచిన వాన


అనపర్తిలోని భట్టువారి రావిచెట్టు సమీపంలో నీట మునిగిన 200 ఎకరాల్లో వరి నాట్లు వేసిన పొలాలు

- నీట మునిగిన వరి పొలాలు
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- ఈదురుగాలులకు నేలకొరిగిన చెట్లు
- వాహనదారులు ఇబ్బందులు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 19: నగరం నీట మునిగింది. ఎటు చూసినా నీరే..గత 48 గంటల పైబడి వర్షం ఎడతెరపిలేకుండా కురుస్తుం డడంతో డ్రెయినేజీలు ఉప్పొంగుతున్నాయి. గురువారం భారీగా వర్షం కురిసినా శుక్రవారం కాస్త సాధారణ స్థాయిలో వర్షం పడింది. అయినా జనజీ వనం అస్తవ్యస్తమైంది. కూలీనాలీ చేసుకునే ప్రజలు ఇబ్బందులు పడ్డారు. బయట పనుల్లేక వర్షాలకు బయటకు వెళ్లలేక ఆకలితో అలమటిస్తున్నారు. చిరువ్యాపారులు, కార్మికులు, కూలీలు వర్షానికి ఇబ్బందులు పడుతున్నారు. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకున్నారు. చౌడేశ్వర్ నగర్ మొదలుకొని లాలాచెరువు, క్వారీ వైపు, అటు గెయిల్ ఆఫీస్ రోడ్డు మొదలుకొని నగరంలో అన్ని ఎత్తు ప్రదేశాల నుంచి వర్షపు నీరు అటు రాకి చానల్, ఇటు డ్రెయినేజీల గుండా నల్లా చానల్, గోదావరి బండ్ నుంచి గోదావరిలోకి కనెక్టివిటి గల పం పింగ్ చానల్స్‌కు ఎప్పటికప్పుడు పంప్ చేయడంతో నగరంలో కాస్త ముంపు సమస్య తప్పింది. మరొక పక్క గోదావరి పెరుగుతుండడంతో నగరంలో మురుగునీటి పారుదలకు అడ్డంకులు లేకుండా చర్యలు చేపడుతున్నారు. కమాండ్ కం ట్రోల్ రూమ్ నుంచి నగరంలో పరిస్థితిని ఎప్పటికప్పుడు కమిషనర్ దినేష్ కుమార్ పర్యవేక్షిస్తున్నారు. ప్రభుత్వం శనివారం విద్యాసంస్థలకు సెలవు ప్రకటించడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఊరట చెందారు.

గోకవరం: గోకవరంలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేక పలు వీధుల్లో బురదనీరు పేరుకుపోవడంతో స్థానికులు నానా అగచాట్లు పడుతున్నారు. గ్రామంలో చేపడుతున్న పారిశుధ్య నిర్వహణ పనులను మండల ప్రత్యేక అధికారి శ్రీవ ు ు ఖలింగం, ఎంపీడీవో గోవిందు పరిశీలించారు. ప్రతిరోజు పంచాయతీ సిబ్బంది నిర్వహించే పారిశుధ్య దినచర్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని పలు వీధుల్లో పంచాయతీ కార్యదర్శి టి.శ్రీనివాసరావు పర్యవేక్షణలో జరుగుతున్న పారిశుధ్య పనులను ప్రత్యేకాధికారి, ఎంపీడీవో స్వయంగా పరిశీలించి పలు సూచనలు చేశారు.

అనపర్తి: అనపర్తి శివారు భట్టువారి రావిచెట్టు సమీపంలో కాకినాడ కాలువకు ఆనుకుని ఉన్న సుమారు 200 ఎకరాల్లో వరి ఊడ్పు భూములు పూర్తిగా నీటమునిగాయి. ఇప్పటికే రెండు రోజులుగా పూర్తిగా నీటమునిగి ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని మరికొన్ని ప్రాంతాల్లో వరి పొలాలు నీట మునిగాయి. గురువారం రాత్రి వీచిన ఈదురు గాలులకు పెడపర్తి సమీపంలో పెద్ద చెట్టు రోడ్డుపై పడిపోవడంతో మండపేట వెళ్లే వారు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అనపర్తిలోని అండర్ పాస్ రోడ్డులో మరింత నీరు వచ్చి చేరడంతో విద్యార్థులు, వ్యాపారులు ట్రాక్ అవతలకు వెళ్లేందుకు రైల్వే ఓవర్ బ్రిడ్జి మీదుగా మూడు కిలో మీటర్లు చుట్టు తిరిగి వెళ్లాల్సి రావడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

కడియం: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం, దానికి తోడు ఎగువ నుంచి వస్తున్న నీరు కారణంగా పంట మునకకు గురైంది. కడియం ఆవలో రైతులు వరి నాట్లు వేసి కొంతకాలం కాగా వర్షాలు పంటను పూర్తిగా ముంచెత్తడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పొలంలో నీరు బయటకు పోతేనే పంటను కాపాడుకోనే అవకాశం ఉంటుందని అంటున్నారు.

రంగంపేట: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు రోడ్లన్నీ చెరువులను తలపిస్తున్నాయి. రంగంపేట సమితి ఆఫీసు నుంచి చంద్రేడు గ్రామం వెళ్లే రోడ్డు పెద్ద పెద్ద గోతులు పడి అధ్వానంగా తయారైంది. నీళ్లతో నిండిపోవడంతో గోతులు కనబడక వాహదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వం రోడ్లకు మరమ్మతులు చేపట్టకుండా, డ్రైనేజీలు నిర్మించకపోవడం వల్లే ఇప్పుడు ఈ దుస్థితి దాపురించిందని ప్రజలు వాపోతున్నారు.

287.9 హెక్టార్లలో వరి పంట మునక

రాజమహేంద్రవరం రూరల్, జూలై 19: రాజమహేంద్రవరం రూరల్ మండలం పరిధిలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు 287.9 హెక్టార్లలో వరి పంట మునిగినట్టు మండల వ్యవసాయాధికారి భీమరాజు తెలిపారు. మండలంలో 264 మంది రైతులకు గాను, హకుంపేటలో 11 హెక్టార్లు, బొమ్మూరులో 10, ధవళేశ్వరంలో 8.9, రాజవోలు 1.2లలో 20, తొర్రేడు 1.2లలో 172, కోలమూరు 1.4లలో 30, కాతేరులో 12, వెంకటనగరంలో 24 హెక్టార్లలో వరి పంట మునిగినట్టు తెలిపారు.


కోరుకొండ: శ్రీరంగపట్నంలో బురదకాలువ పరిస్థితిని కలెక్టర్‌కు వివరిస్తున్న అధికారులు


రంగంపేట: కాలువగా మారిన చంద్రేడు రోడ్డు


చెరువును తలపిస్తున్న కడియం ఆవ వరిపొలాలు


అనపర్తి మండలం పెడపర్తి వద్ద భారీ వర్షాలకు నేలకొరిగిన చెట్టు


రాజమహేంద్రవరం మోరంపూడిలో వర్షానికి ఛిద్రమైన రోడ్డు

బాధ్యతగా విధులు నిర్వర్తించాలి

జిల్లా కలెక్టర్ ప్రశాంతి.. ములకల్లంకలో పర్యటన

సీతానగరం, జూలై 19: జిల్లా అధికారులు సమన్వయంతో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులకు సూచించారు. శుక్రవారం ఆమె మండలంలోని ములకల్లంక గ్రామంలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణతో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాగునీరు, విద్యుత్ సరఫరా, శానిటేషన్ పక్కాగా నిర్వహించాలన్నారు. వరద ఉధృతంగా ఉన్న ప్రాంతాల్లో ప్రాణనష్టం, పశునష్టం లేకుండా అధికారులు నిరంతర పర్యవేక్షణలో ఉండాలన్నారు. గోదావరి వరద పెరిగితే మర పడవలపై ప్రయాణం నిలిపివేస్తామని, బోటులను ఏర్పాటు చేస్తామన్నారు. తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించారు. అన్ని శాఖల అధికారులను అప్రమత్తం చేశామన్నారు. ఏటిగట్టు బలహీనంగా ఉన్నచోట పటిష్టమైన రక్షణ చర్యలు చేపట్టనునటుట్టి చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీవో చైత్రవర్షిణి, మండల ప్రత్యేకాధికారి నెల్సన్ పాల్‌బాబు, ఈవోపీఆర్డీ మూర్తి, పంచాయతీ కార్యదర్శి రజాన్, వీఆర్వో నాగమణి తదితరులు పాల్గొన్నారు.

శ్రీరంగపట్నం బురద కాలువను పరిశీలించిన కలెక్టర్

కోరుకొండ, జూలై 19: భారీ వర్షాలకు ఏజెన్సీ ప్రాంతం నుంచి బురదకాలువ గుండా వరదనీరు గోదావరిలో కలిసే సందర్భంలో కోరుకొండ మండలంలోని లోతట్టు గ్రామాలైన శ్రీరంగపట్నం, మునగాల, బుచ్చింపేట, కోటి, రాఘవపురం గ్రామాలకు ప్రమాదం పొంచి ఉంది. ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం కలెక్టర్ పి.ప్రశాంతి, ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, ఆర్డీవో చైత్రవర్షిణి శ్రీరంగపట్నం వద్ద బురద కాలువను పరిశీలించారు. శుక్రవారం రాత్రికి సూరంపాలెం రిజర్వాయర్‌లోని మిగులు జలాలను దిగువకు వదలనున్నారు. దీంతో బురద కాలువకు వరద ఉధృతి పెరిగే అవకాశం ఉండడంతో స్థానిక రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీ, వైద్య ఆరోగ్య సిబ్బంది పూర్తి అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు సమాచారాన్ని కంట్రోల్‌రూమ్‌కు తెలియజేయాలన్నారు. అవసరమైతే లోతట్టు గ్రామాల ప్రజలను అప్రమత్తం చేసి సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. ఏటా వర్షాల సమయంలో బురద కాలువకు వచ్చే వరద ఉధృతిపై కలెక్టర్ గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. ఇరిగేషన్ అధికారులు పరిస్థితిని వివరించారు. గ్రామం మొదట్లో బురద కాలువ మళ్లింపు, ఇటీవల బురద కాలువకు చేసిన తాత్కాలిక మరమ్మతులను ఆమె పరిశీలించారు. అలాగే కోటికేశవరం, చిన్న పెద్ద చెరువుకు వరదనీరు ఉధృతంగా రావడం, కళింగలు ద్వారా కిందకు వదలనున్న నేపథ్యంలో ఆ నీటికి అడ్డుకట్ట వేయవద్దని ఆర్డీవో చైత్రవర్షిణి కోటికేశవరంలో రెవెన్యూ, పంచాయతీ అధికారులకు ఆదేశాలిచ్చారు. కలెక్టర్ పర్యటనకు ముందు ఆర్డీవో కోటికేశవరంలో పర్యటించి చిన్నపెద్ద చెరువులను పరిశీలించారు. ఇదిలా ఉండగా అధిక వర్షాలకు మండలంలోని జంబుపట్నం సచివాలయం, నర్సాపురం జడ్పీ హైస్కూల్ సమీపంలోను పెద్ద ఎత్తున వరదనీరు ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి ప్రవహిస్తోంది. దీంతో లోతట్టు గ్రామాలైన నర్సాపురం, కోరుకొండ, జంబుపట్నం, శ్రీరంగప ట్నం, గోనగూడెం, ముగ్గళూరు, బుచ్చింపేట గ్రామాల్లో పంట పొలాల్లోకి నీరు చేరింది. కలెక్టర్ వెంట బత్తుల వెంకటలక్ష్మి, అడపా శ్రీనివాస్, నాతిపాము దొరబాబు, తనకాల నాగేశ్వరరావు, సర్పంచ్ మద్దాల రమణ, పలువురు అధికారులు ఉన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

పునరావాస కేంద్రాలు సిద్ధం చేయాలి.. కమిషనర్ దినేష్‌కుమార్

రాజమహేంద్రవరం సిటీ, జూలై 19: అధికారులు ,సిబ్బంది అందరూ అప్రమత్తంగా ఉండాలని రాజమహేంద్రవరం కమిషనర్ దినేష్ కుమార్ ఆదేశించారు. రాజమహేంద్రవరంలో లోతట్టు ప్రాంతాలు డీలక్స్ సెంటర్, హైటెక్ బస్టాండ్, కంబాలచెరువు, ఆర్యాపురం, కృష్ణనగర్, అల్‌కట్ గారెన్స్ , ప్రాంతాలు, నల్లా చానల్ , రాలి చానల్‌లను శుక్రవారం పరిశీలించారు. నల్లా చానల్ పంపింగ్ స్కీమ్, ఎస్ఆర్‌సీపీ పంపింగ్ స్కీమ్‌ల వద్ద మోటార్ల కండీషన్ పరిశీలించి సిబ్బందికి దిశానిర్ధేశం చేశారు. నిరంతరం మోటార్లు వర్షపు నీటిని పంపింగ్ చేయాలని ఆదేశించారు. వివిధ పాఠశాలలు, మునిసిపల్ కల్యాణ మండపాలు, పందిరి మహదేవుడు సత్రంలను పునరావస కేంద్రాలుగా మార్చి అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. సిబ్బందిని నియమించామని చెప్పారు. అవసరమైనప్పుడు నిర్వాసితులను పునరావస కేంద్రాలకు తరలించాలన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని 24/7 పనిచేస్తుందన్నారు. ప్రజలు ఏదైనా సమస్య ఉంటే 94940 60060 నెంబరుకు ఫోన్ చేయాలని అన్నా రు. ఆయన వెంట అదనపు కమిషనర్ పీఎం సత్యవేణి, సూపరింటెండెంట్ ఇంజనీర్ జి.పాండురంగారావు, ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న, ఈఈ, డీఈ, ఏఈ, శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ,సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలి

రంగంపేట, జూలై 19: అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి, గ్రామీణ నీటి సరఫరా విభాగం సూపరింటెండెంట్ బాల శంకరరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీవో పి.వెంకటరత్నం అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మండల పరిషత్, సచివాలయ సిబ్బందికి ఆయన పలు సూచనలు చేశారు. మండలంలోని సుభద్రంపేట, దొడ్డిగుంట, వెంకటాపురం, రంగంపేట గ్రామాలను సందర్శించారు. సుభద్రంపేట-దొడ్డిగుంట రోడ్డులో జమ్మి చెరువు నుంచి రోడ్డు మీదుగా ప్రవహిస్తున్న వరద నీటిని పరిశీలించారు. దీనిపై అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ ఏఈ శ్రీనివాసరావు, కార్యదర్శులు మణికుమార్, కాత్యాయిని తదితరులు పాల్గొన్నారు.


బిక్కవోలులో నీట మునిగిన పొలాలను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి విజయకుమారి

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

రాజానగరం, జూలై 19: అతిసార వ్యాధి, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ ఎన్.వసుంధర సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం రాజానగరం వచ్చిన ఆమె చెరువుగట్టు వీధిలో నీటి క్లోరినేషన్ పరీక్షను స్వయంగా పర్యవేక్షించి లాగ్ రిజిస్టరును తనిఖీ చేశారు. స్థానిక సుబ్బారావునగర్‌లో లెప్రసీ సర్వేను పర్యవేక్షించారు. పీహెచ్‌సీలో ఓపీ, ల్యాబ్ రికార్డులను తనిఖీచేశారు. టీబీ రోగులకు ప్రతినెలా ఫాలోఅప్‌లు అందుతున్నాయా లేదా అని ఆరాతీశారు. అలాగే 10, 11 తేదీల్లో లెప్రసీ డీపీఎంఆర్ కార్యకలాపాలు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. గర్భిణీలకు హెచ్‌ఐవీ పరీక్షల గురించి అడిగి తెలుసుకున్నారు.

అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

బిక్కవోలు, జూలై 19: అధికంగా కురుస్తున్న వర్షాల పట్ల మండల స్థాయి అధికారులు, పంచాయితీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి ఐసీడీఎస్ పీడీ విజయకుమారి సూచించారు. బిక్కవోలు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఆమె పంచాయతీ కార్యదర్శులు, వ్యవసాయశాఖ సిబ్బంది, ఇతర అధికారులతో సమావేశం నిర్వహించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం బిక్కవోలు లింగాల చెరువు ఆయకట్టులో నీట మునిగిన 50 ఎకరాల పొలాలను పరిశీలించారు. ప్రత్యేకాధికారి వెంట తహశీల్దార్ కన్యాకుమారి, ఎంపీడీవో విజయలక్ష్మి, బిక్కవోలు పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణరెడ్డి ఉన్నారు.


అధికారులకు సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి

అధికారులు అప్రమత్తంగా ఉండాలి : గోరంట్ల

ధవళేశ్వరం, జూలై19: గత పాలకుల నిర్లక్ష్యం వల్లే రాజమహేంద్రవరంతోపాటు రూరల్ నియోజకవర్గ గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్థంగా తయారైందని రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చియ్య చౌదరి విమర్శించారు. చిన్నపాటి వర్షానికే రాజమహేంద్రవరం జలమయం అవుతుందన్నారు. కాటన్ బ్యారేజ్‌పై శుక్రవారం గోదావరి ఉధృతిని పరిశీలించి మాట్లాడారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం ధవళేశ్వరంలో డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించారు. జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన డి.నరసింహ కిషోర్‌ను ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి శుక్రవారం మర్యాదపూర్వకంగా ఎస్పీ కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.ఆయన వెంట పందూరి అప్పారావు, మార్ని వాసుదేవరావు, మార్గాని సత్యనారాయణ, పిన్నింటి ఏకబాబు, ఆళ్ళ ఆనందరావు, తలారి మూర్తి, నీలి కోటేశ్వరరావు, కర్రం రామారావు తదితరులు ఉన్నారు.

ఆగస్టు 10,11 తేదీల్లో రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్ పోటీలు

రాజమహేంద్రవరం రూరల్, జూలై 19: రాజమహేంద్రవరాన్ని క్రీడా కేంద్రంగా మారుస్తామని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. ఆగస్టు 10,11 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్ చాంపియన్ షిప్ పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం రాజమహేంద్రవరంలోని గోరంట్ల నివాసంలో ఆవిష్కరించారు. ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల గ్రౌండ్స్‌లో పోటీలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో చీఫ్ ఆర్గనైజర్ ఎం.గణేష్, ఎస్.గిరి వెంకటరమణ,కిక్ బాక్సింగ్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు సంతోష్,రాష్ట్ర అధ్యక్షుడు కె.అగర్వాల్, రాష్ట్ర కార్యదర్శి జి.ఆనంద్ బాబు తదితరులు పాల్గొన్నారు.

బాలికల సంరక్షణలో భాగస్వాములవుదాం

రాజమహేంద్రవరం సిటీ, జూలై 19: బాలికల హక్కులను పరిరక్షించడంలో అందరూ భాగస్వాములు కావాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.అచ్చియ్యమ్మ అన్నారు. ఆనంద్‌నగర్ సెక్టార్ పరిధిలోని ఆర్యాపురం అంగనవాడీ సెంటర్‌లో భేటీ బచావో-భేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. బాలల హక్కులు, బాల్యవివాహాలు, బాలల అక్రమ రవాణా, పోక్సో చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.



గోగులమ్మ ఆలయంలో పారాయణం..
శాకంబరిగా దర్శనమిచ్చిన గోగులమ్మ

శాకంబరిగా గోగులమ్మ

రాజమహేంద్రవరం కల్చరల్, జూలై 19 : ఆషాడమాసం సందర్భంగా అమ్మవార్లు శాకంబరి అలంకారంలో భక్తులు దర్శనమిస్తున్నారు. ఇన్నీస్‌పేటలో గోగులమ్మకు శుక్రవారం లలిత మహిళా మండలి సభ్యులు కూరగాయలతో ప్రత్యేక అలంకారం చేశారు.శాకంబరి అలంకరణలో దర్శన మిచ్చిన అమ్మవా రిని దర్శించుకుని భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. నిర్వాహకులు సాయం త్రం ఆ కూరగాయలను పంపిణీ చేశారు.

వాహన చట్టాలను పాటించాలి

జూనియర్ సివిల్ జడ్జి రెడ్డి ప్రసన్న

అనపర్తి, జులై 19: ప్రతి ఒక్కరూ వాహన చట్టాలను పాటించి,వాహనాలను నడపడం ద్వారా సురక్షితంగా గమ్యానికి చేరుకుంటారని అనపర్తి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి రెడ్డి ప్రసన్న పేర్కొ న్నారు. శుక్రవారం అనపర్తి జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె పాల్గొని ప్రసంగించారు. వాహన చట్టాలు, హెల్మెట్, సీట్ బెల్ట్ వంటి అంశాలపై ప్రజలకు అవగాహన ఉండాలన్నారు. అతి వేగం ప్రమాదమని తెలిసినా కొందరు అతి వేగంగా ప్రయా ణించి ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ప్రమాదాల్లో నష్టపోయిన వారికి న్యాయం జరిగే విధంగా మండల లీగల్ సర్వీస్ కమిటీ సహకరిస్తుందన్నారు.అనంతరం జోరువానలో న్యాయవాదులు,పోలీసులతో కలిసి హెల్మెట్‌పై నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏపీపీ సిద్దార్థ, బార్ సభ్యులు పాల్గొన్నారు.

చిన్నారి వైద్యానికి రూ.60 వేలు సాయం

రాజమహేంద్రవరం సిటీ, జూలై 19 : చెవి సమస్యతో బాధపడుతున్న నాలుగేళ్ళ చిన్నారికి ఆపరేషన్ నిమిత్తం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ రూ. 60 వేలు అందించారు. స్థానిక తిలక్‌రోడ్డులోని ఎమ్మెల్యే కార్యాలయంలో చిన్నారికి వైద్యం నిమిత్తం సహాయం చేయాలని శుక్రవారం తల్లిదండ్రులు ఎమ్మెల్యేను కోరారు. దీనిపై స్పందించిన ఆయన భవాని చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నగదు అందించారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ కమిటి ఆర్గనైజింగ్ సెక్రటరీ కొయ్యల రమణ తదితరులు పాల్గొన్నారు.



నిండా.. ముంచేను!



అన్నదాతకు.. కన్నీళ్లు : కడియంలో నీట మునిగిన వరి చేలు.. కొవ్వూరులో ఎక్స్‌కవేటర్‌తో కాలువలో తూడు తొలగిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

చినుకు వణికిస్తుంది.. నిండా ముంచేసింది.. ఎక్కడా తెరిపివ్వలేదు.. గత మూడు రోజులుగా వరుణదేవుడు వదల్లేదు.. జిల్లా వ్యాప్తంగా పంట చేలన్నీ నీట మునిగాయి.పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి.రోడ్లు చెరువులను తలపించాయి.చాలా గ్రామాల్లో ఊళ్లు..పొలాలు ఏకమయ్యాయి. జనజీవనం అస్తవ్యస్తమైంది. జిల్లా అంతా తడిచిముద్దయింది. మరో రెండు మూడు రోజుల పాటు భారీ వర్షాలు ఉండొచ్చని అధికారుల హెచ్చరికల నేపథ్యంలో జనం ఆందోళన చెందుతున్నారు. ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న వరద నీటితో గోదావరి ఉప్పొంగుతోంది.పోలవరం ఎగువ కాఫర్ డ్యామ్ వద్ద వరద నీరు తన్నిపట్టింది. స్పిల్‌వే గుండా రాజమహేంద్రవరం వైపు వరద నీటిని వదిలేస్తున్నారు. జంగారెడ్డిగూడెం ప్రాంతం నుంచి వచ్చే ఎర్రకాలువ పొంగడం వల్ల గోపాలపురం, నల్లజర్ల, నిడదవోలు నియోజకవర్గాల్లో అనేక ప్రాంతాలు నీట మునిగాయి. ఎర్రకాలువ, కొవ్వాడ కాలువలకు వరద నీరు పోటెత్తడంతో వేలాది ఎకరాల్లో వరి పొలాలు నీట మునిగాయి. చేలన్నీ గోదావరిలా మారాయి. దేవరపల్లి మండలంలో తాడిపూడి కాల్వ పొంగి ప్రవహించటంతో యర్నగూడెం, సుబ్బరాయపురం మధ్యలో తాడిపూడి కాల్వకు గండిపడింది. దీంతో యర్నగూడెం, సూర్యనారాయణపురం, త్యాజంపూడి గ్రామాల్లో వరినాట్లు ముంపునకు గురయ్యాయి. గురు వారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం 8.30 గంటల వరకూ జిల్లాలో 1922.2 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లాలో భారీ వర్షాలు,ఎర్రకాలువ, కొవ్వాడ కాలువ పొంగడం వల్ల 51 హెక్టార్లలో నారుమళ్లు, 7965.9 హెక్టార్లలో నాట్లు నీట మునిగినట్టు వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు తెలిపారు.18 మండలాల పరిధిలోని 178 గ్రామాల్లో 9613 మంది రైతుల పొలాలు మునిగాయన్నారు.

పొలాలను ముంచెత్తిన వాన

- జిల్లా అంతటా చినుకు..వణుకు
- ఉప్పొంగుతున్న గోదావరి
- ఎర్రకాల్వ,కొవ్వాడ కాల్వల ఉధృతి
- ఎర్రకాల్వలో పడి మత్స్యకారుడి మృతి
- 7965 హెక్టార్లలో పంట మునక
- అన్నదాతకు ఆగని కన్నీళ్లు
- పర్యటించిన కలెక్టర్, మంత్రి
- రహదారులపై పారిన వరదనీరు
- ఆదుకుంటామన్న నాయకులు



పోటెత్తిన గోదారి : ధవళేశ్వరం బ్యారేజీ వద్ద ఇలా..

- వివరాలు 8లో



నాడు.. నేడు ఇంతేగా : పెరవలి మండలం నడిపల్లికోటలో నీటమునిగిన నెం.2 పాఠశాల

సీతానగరంలో అత్యధికం

రాజమహేంద్రవరం సిటీ, జూలై 19 : జిల్లాలో అల్పపీడన ద్రోణి ప్రభావంతో వర్షాలు పడుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 19 మండలాల్లో గురువారం రాత్రి నుంచి శుక్రవారం సాయంత్రం వరకూ మొత్తం 1922.2 మి.మీ వర్షపాతం నమోదైంది. అత్యధికంగా సీతానగరం మండలంలో 267.2 మి.మీ వర్షపాతం.. అత్యల్పంగా రాజానగరంలో 36.4 మి.మీ వర్షపాతం నమోదైంది. దేవరపల్లిలో 145.8 మి.మీ, నిడదవోలులో 137.8 మి.మీ, కడియంలో 114.6 మి.మీ, ఉండ్రాజవరంలో 109.6 మి.మీ, చాగల్లులో 107.6 మి.మీ, రాజమహేంద్రవరం రూరల్‌లో 104.8 మి.మీ, గోపాలపురంలో 103.6 మి.మీ, పెరవలిలో 101.4 మి.మీ, రాజమహేంద్రవరంలో 96.8 మి.మీ, తాళ్లపూడిలో 94.6 మి.మీ, నల్లజర్లలో 93.4 మి.మీ, కొవ్వూరులో 84.6 మి.మీ, అనపర్తిలో 78.2 మి.మీ, కోరుకొండలో 77.4 మి.మీ, బిక్కవోలులో 71.8 మి.మీ, రంగంపేటలో 53.4 మి.మీ, గోకవరంలో 43.2 మి.మీ వర్షపాతం నమోదైంది.

రహదారి కట్..కట



సీతానగరం చీపురుపల్లి మధ్య ఉన్న రోడ్డుపై ఆరడుగుల లోతున పారుతున్న నీరు

సీతానగరం,జూలై 19 : రోడ్డుపై వెళుతున్న నీటిలో ద్విచక్ర వాహనంపై వెళుతూ ఒక యువకుడు బైక్‌తో సహా కొట్టుకుపోయాడు. సీతానగరం నుంచి చీపురుపల్లి మీదుగా కోరుకొండ వెళ్లే రోడ్డులో సీతానగరం చీపురుపల్లి మధ్య ఉన్న దిగుడు కల్వర్టు నీటితో నిండిపోయి రోడ్డుపై నుంచి నీరు పారుతోంది. సుమారు 6 అడుగుల దిగుడు ఉండే ఈ కల్వర్టు మీదుగా నీళ్లలో ద్విచక్రవాహనంపై వెళ్లే ప్రయత్నం చేసిన యువకుడు ప్రమాదవశాత్తు నీటిలో కొట్టుకుపోవడంతో స్థానికులు కాపాడారు. ద్విచక్ర వాహనం కనిపించలేదు. దీంతో ఆ రహదారిలో రాకపోకలు నిలిచిపోయాయి.. రాపాక నుంచి కోటికేశవరం మీదు గా కోరుకొండ వెళ్లే రహదారిలో రాపాక కేశవరం మధ్య బురదకాలువ నీరు రోడ్డెక్కడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ముగ్గుళ్ళ నుంచి కోరుకొండ వెళ్లే రోడ్డులో మునగాల వద్ద గతంలో గండిపడడంతో రాకపోకలు నిలిచిపోయాయి.



ఇసుక బంద్ : తీపర్రు ర్యాంప్ వద్ద నిలిచిన లారీ

నీటిలో తహశీల్దార్ ఆఫీస్

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 19 : రాజమహేంద్రవరంలోని అర్బన్ తహశీల్దార్ కార్యాలయం నీట మునిగింది. కార్యాలయం చుట్టూ వర్షపునీరు చేరడంతో పాటు కార్యాలయం లోపలకు దాదాపుగా మోకాలిలోతు నీరు రావడంతో రెవెన్యూ విధులకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. దీంతో కార్యాలయంలో పనిచేసే పరిస్థితులు లేక ఉద్యోగులంతా కార్యాలయం ఎదురుగా ఉన్న చిన్న వినాయకుడి గుడి వద్ద కూర్చుని నీరు ఎప్పుడు లాగుతుందా అని ఎదురు తెన్నులు చూశారు. ఒక మోస్తరు వర్షాలు కురిసినా అర్బన్ తహశీల్దార్ కార్యాలయంలోకి నీరు చేరుతుంది. గత కొన్నేళ్లుగా ఈ సమస్యను ఎదుర్కొంటున్నా పాలకులు పట్టించుకోవడం లేదు.



నీట మునిగిన రాజమహేంద్రవరం తహశీల్దార్ కార్యాలయం



ఆరంభమే వర్రీ : వేమగిరిలో నీట మునిగిన వరి చేలు



కాలువ కాదు : కంసాలిపాలెంలో ఎర్రకాల్వ ఉధృతికి నీటిలో పొలాలు



పంట..తంట : తాళ్లపూడి మండలం తిరుగుడుమెట్టలో నీట మునిగిన పొలాలు



తాడిపూడి కాల్వకు గండి : దేవరపల్లి మండలం యర్నగూడెం శివారులో పడిన గండి

నేడు పాఠశాలలకు సెలవు

రాజమహేంద్రవరం, జూలై19(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో భారీగా వర్షాలు కురుస్తున్న కారణంగా శనివారం జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలకు సెలవు ప్రకటించినట్టు డీఈవో కె. వాసుదేవరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ప్రకటన జారీ చేశారు.



నిడదవోలులో వరద బాధిత ప్రాంతాల్లో పర్యటిస్తున్న మంత్రి దుర్గేష్, కలెక్టర్ ప్రశాంతి, ఎస్పీ నరసింహ కిశోర్

గోదావరిలో వేటకు వెళ్లొద్దు : కలెక్టర్

కొవ్వూరు/నిడదవోలు, జూలై 19 : వరద ఉధృతి ఎక్కువగా ఉన్నందున గోదావరిలో చేపల వేటకు ఎవ్వరు వెళ్లవద్దని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. నిడదవోలు, కొవ్వూరు,నల్లజర్ల, గోపాలపురం ప్రాంతాల్లో పర్యటించి పలు సూచనలు చేశారు. ధవళేశ్వరం బ్యారేజి వద్ద 175 గేట్లు ఒక మీటరు పైకెత్తి 3,46,391 క్యూసెక్కుల వరదనీరు సముద్రంలోకి విడుదల చేసినట్టు తెలిపారు. కొవ్వూరు మండలం మద్దూరులంక గ్రామంలో శుక్రవారం వరద పరిస్థితిని కలెక్టర్, సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాత్సవ అధికారులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. గోదావరిలో వరద ఉధృతి ఎక్కువగా ఉందన్నారు. మద్దూరులంక గ్రామంలో బలహీనంగా ఉన్న గట్టును పరిశీలించి ఏటిగట్టుకు ముందస్తు జాగ్రత్తగా అడ్డుకట్టలు వేసి వరదనీటిని నియంత్రించాలన్నారు. వరద ఉధృతి తగ్గే వరకు మొదటి ప్రమాద హెచ్చరిక కంటే ముందుగానే పునరావాస కేంద్రానికి వచ్చి ప్రజలు సహకరించాలన్నారు. పంట పొలాల్లో నిలిచిన వర్షపునీటి బయటకు పంపే ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ముంపు ప్రాంతాలను గుర్తించి సమస్యల్లేకుండా చూడాలని ఆదేశించారు. జేసీ, తహశీల్దార్లతో కలిసి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ముంపు బాధిత ప్రాంతాల్లో అధికారులు పర్యటించి ఫొటోలు, వివరాలు ఎప్పటికప్పుడు వాట్సప్ గ్రూపు ద్వారా షేర్ చేయాలన్నారు. పరిస్థితులకనుగుణంగా తహశీల్దార్లు, డిజాస్టర్ నిర్వహణలో కమాండెంట్‌గా విశిష్ట అధికారాలు కలిగి ఉంటారని స్పష్టంచేశారు.

ఇన్‌పుట్ సబ్సిడీకి చర్యలు : మంత్రి

ఎర్రకాలువ వరదనీటి ముంపు నివారణకు ఏటిగట్టు పటిష్ఠతకు శాశ్వత పరిష్కార దిశగా చర్యలు చేపడతామని రాష్ట్ర పర్యాటక,సాంస్కృతిక, సినిమా టోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. నిడదవోలు మండలంలోని కంసాలిపాలెం, శింగవరం,రావిమెట్ల గ్రామాల్లో నీట మునిగిన పంట పొలాలను శుక్రవారం మంత్రి కందుల దుర్గేష్, జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు పరిశీలించారు. రైతాంగానికి సీడ్ సబ్సిడీ మాత్రమే కాకుండా ఇన్‌పుట్ సబ్సిడీ రూ.6వేలు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి భారీ వర్షాలకు వరదలకు ఏర్పడిన నష్టాన్ని పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారన్నారు. జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్, సబ్ కలెక్టర్ శ్రీ వాత్సవ ఉన్నారు.

వేటకు వెళ్లిన మత్స్యకారుడి మృతి

నిడదవోలు, జూలై 19 : మత్స్యకారుడి వేసిన వల అతని కాలికే నీటిలో పడి మృతిచెందాడు. నిడదవోలు పట్టణం తీరుగూడెంకు చెందిన మత్స్యకారుడు గణసాల వెంకటేష్ (56)కు చేపల వేట జీవనాధారం. ఎర్రకాలువ వరద ఉధృతి ఎక్కువగా ఉండడంతో శుక్రవారం ముంపు ప్రాంతంలో చేపలు పట్టేందుకు వెళ్లాడు.ప్రమాదవశాత్తు నీట మునిగి మృతిచెందాడు. మృతదేహాన్ని నిడదవోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య పాపమ్మ,కుమారుడు శ్రీధర్, కుమార్తె మరియమ్మ ఉన్నారు.కుటుంబం పెద్ద దిక్కును కోల్పోవడంతో కన్నీటి పర్యంతమవుతున్నారు.మంత్రి కందుల దుర్గేష్, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు మృతుడి కుటుంబీకులను పరామర్శించారు.



జిల్లా జడ్జిని కలిసిన కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ, జూలై 19 : జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీతను జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి శుక్రవారం మరాద్యపూర్వకంగా కలిశారు. కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన తరువాత ఆమెను కలవలేదు. ఈ నేపథ్యంలో శుక్రవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కలెక్టర్ కలిసి మొక్కను అందజేశారు.

పీఎం విశ్వకర్మ పథకంపై అవగాహన సదస్సు

రాజమహేంద్రవరం రూరల్, జూలై 19 : ప్రధాన మంత్రి విశ్వకర్మ పథకం ద్వారా స్వయం ఉపాధి కల్పించడంతో పాటు చేతి, కులవృత్తులు చేసుకునే వారికి సబ్సిడీతో కూడిన బ్యాంకు రుణాలు అందజేస్తారని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి కొండబాబు తెలిపారు. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాల మేరకు కలెక్టరేట్ ఆవరణలో గల నాక్ కార్యాలయంలో సమన్వయ శాఖల క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందితో సంబంధిత శాఖల అధికారులు పీఎం విశ్వకర్మ పథకం మార్గదర్శకాల అమలుపై ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పీవీకే.ప్రసాద్, ఎస్‌వీఎస్.ప్రసాద్, డీఎల్‌డీవో వీణాదేవి, టి.రాజేష్ పాల్గొన్నారు.

నేడే ఆర్యాపురం అర్బన్ బ్యాంక్ పోలింగ్



పోలింగ్ ఏర్పాట్లపై సమీక్షిస్తున్న ఎస్పీ కిషోర్

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ప్రతిష్ఠాత్మకమైన ఆర్యాపురం కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ పోలింగ్‌కు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నందం గనిరాజు సెంటర్‌లో ఉన్న ఎస్‌కేవీటీ కళాశాలలో శనివారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ పోలింగ్ నిర్వహించనున్నా రు. మొత్తం 74.585 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఎస్‌కేవీటీ ఇంగ్లీష్ మీడియం స్కూల్, ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాలలో 48 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. ఇతర ప్రాంతాలో 6 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. ఎన్నికల నిర్వహణకు 380 మంది సిబ్బందిని నియమించారు.200 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు.ఆదివారం కౌటింగ్ నేపథ్యంలో 75 మంది సిబ్బందిని ఏర్పాటు చేసినట్టు ఎన్నికల అధికారి వి.కృష్ణకాంత్ తెలిపారు. మొత్తం బ్యాంక్‌కు 16 బ్రాంచిలు ఉన్నాయి. వాటిని మూడు బ్యాంక్ నియోజకవర్గాలుగా విభజించారు.బ్యాంక్‌కు 12 మంది డైరెక్టర్లు ఉంటారు. మొదటి నియోజకవర్గం రాజమహేంద్రవరం పరిధిలోనే ఉంది. ఇక్కడ 10 మంది డైరెక్టర్లను ఎన్నుకుంటారు. రెండో నియోజకవర్గంలో ఒకరే నామినేషన్ వేయడంతో అది ఏకగ్రీవమైన సంగతి తెలిసిందే.మూడో నియోజకవర్గం దివాన్‌చెరువు, విశాఖ, భీమవరం, గుంటూరు వంటి ఇతర ప్రాంతాలకు ఒక డైరెక్టర్ పదవి ఉంది. ఇక్కడ ముగ్గురు పోటీ పడుతున్నారు.పదేళ్ల తర్వాత జరుగుతున్న ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నారు. పోలింగ్ స్టేషన్ల వద్ద సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేశారు. పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. టీడీపీ జనసేన బీజేపీ కూటమి చైర్మన్ అభ్యర్థిగా చల్లా శంకరరావు, వైసీపీ నేతల మద్దతు ఉన్న ప్యానల్‌కు నందెపు శ్రీనివాస్ చైర్మన్ అభ్యర్థులుగా ఉన్నారు. మొత్తం 11 డైరెక్టర్ల పదవులకు 34 మంది పోటీ పడుతున్నారు. ఆదివారం ఓట్ల లెక్కింపు జరుగుతుంది.విజేతలైన డైరెక్టర్లు 22న కలిసి చైర్మన్‌ను ఎన్నుకుంటారు. ఈ మేరకు రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ కళాశాల ప్రాంగణంలో ఎన్నికల పోలింగ్‌కు సంబంధించి భద్రత ఏర్పాట్లను ఎస్పీ డి.నరసింహకిశోర్ స్వయంగా పరిశీలించి పోలీస్ అధికారులకు తగిన సూచనలు చేశారు. ఆయన వెంట డీఎస్పీ (ఎస్‌బీ) డి.ప్రభాకర్, డీఎస్పీ (సెంట్రల్ జోన్) విజయపాల్, ఇన్‌స్పెక్టర్ (ఎస్‌బీ) సూరి అప్పారావు, వన్‌టౌన్ సీఐ పుల్లారావు, త్రీటౌన్ సీఐ వీరయ్యగౌడ్ ఉన్నారు.

- 11 డైరెక్టర్ల పదవులకు ఎన్నిక
- ఒక డైరెక్టర్ పదవి ఏకగ్రీవం
- 3 నియోజకవర్గాలుగా ఎన్నికలు
- ఎస్‌కేవీటీ కళాశాలలో ఓటింగ్
- 74,585 మంది ఓటర్లు
- 54 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు
- 655 మంది సిబ్బంది
- రేపు లెక్కింపు..ఎల్లుండి చైర్మన్ ఎన్నిక



పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్లు చేసుకుంటున్న సిబ్బంది

పొగాకు కిలో రూ.380

ఆల్‌టైమ్ రికార్డు.. రైతుల ఆనందం



దేవర పల్లి, జూలై 19: పొగాకు ధరలు రికార్డు స్థాయిలో గణనీయంగా పెరుగుతున్నాయి. దేవరపల్లి పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం వేలం నిర్వహించగా అత్యధికంగా కిలో పొగాకు ధర రూ.380 రేటు పలికింది. రికార్డు స్థాయిలో ధర పల కడంతో రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తుంది. ఇప్పటి వరకూ సరాసరి కిలో పొగాకు రూ.366, కనిష్ఠ ధర రూ.251 పలికినట్టు వేలం నిర్వహణా ధికారి జీఎల్‌కే ప్రసాద్ తెలిపారు. ప్రపంచ మార్కెట్‌లో మన పొగాకు డిమాండ్ ఉండడం జింబాబ్వే, బ్రెజిల్,పలు దేశాల్లో ఉత్పత్తి ఆగడంతో ధర పలుకుతుందని పొగాకు బోర్డు అధికారులు, రైతులు అంటున్నారు.

జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారిణిగా శశాంక



రాజమహేంద్రవరం అర్బన్, జూలై 19 : జిల్లా బీసీ వెల్ఫేర్ అండ్ ఎంపవర్‌మెంట్ అధికారిణిగా బి.శశాంక శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు రాజమహేంద్రవరంలోని జిల్లా కార్యాలయంలో ఆమె బాధ్యతలు తీసుకున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జిల్లాల విభజన జరిగినా ఆ తర్వాత తూర్పుగోదావరి జిల్లాకు పూర్తిస్థాయి బీసీ వెల్ఫేర్ అధికారిని నియమించలేదు. దీంతో అప్పటి నుంచీ రాజమహేంద్రవరం డివిజన్ సహాయ బీసీ వెల్ఫేర్ అధికారి సత్యరమేష్ ఇన్‌చార్జిగా వ్యవహరించారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన శశాంకను అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారి సత్యరమేష్, హాస్టల్ వెల్ఫేర్ అధికారులు సుబ్బారావు, కృపావరం, సత్యకుమారి తదితరులు అభినందించారు.

కోటసత్తెమ్మ ఆలయంలోకి వరద నీరు

నిడదవోలు, జూలై 19: నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలో కోటసత్తెమ్మ దేవస్థానంలోకి వరదనీరు ప్రవేశించింది. కొద్దిరోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఎర్రకాలువ వరదనీరు దిగువకు విడుదల చేయడంతో అమ్మవారి దేవస్థానం వెనుక ఉన్న కల్వర్టు ద్వారా అమ్మవారి గర్భాలయంలోకి ప్రవేశించింది. అలాగే ఆలయ ఆవరణలోని ధ్వజస్తంభం ప్రాంతంలో కూడా వరదనీరు ప్రవేశించింది. ఆలయ అధికార్లు ఆలయం లోపల నీటిని మోటార్ల ద్వారా బయటకు తోడించేలా చర్యలు చేపట్టారు. ఎర్రకాలువ ఎప్పుడు పొంగి ప్రవహించినా అమ్మవారి ఆలయంలోకి ప్రవేశిస్తుందని, సమస్య పరిష్కారానికి ప్రజాప్రతినిధులు అధికారులు శాశ్వత చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.



కోట సత్తెమ్మ ఆలయంలోకి చేరిన వరదనీరు



కొవ్వూరు: మద్దూరులంకలో వరద పరిస్థితిని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి



కొవ్వూరు: ఛిద్రంగా తయారైన నందమూరు-పశివేదల రోడ్డు



చాగల్లు: ఊనగట్లలో నీట మునిగిన వరిచేలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి



తాళ్లపూడి: పోచవరం, తాడిపూడి మధ్య పొంగి పొర్లుతున్న కాలువ నీరు



గోపాలపురం: నీట మునిగిన చెరుకుతోట



నల్లజర్ల: చోడవరంలో ముంపు ప్రాంతాలను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి



నిడదవోలు: కంసాలిపాలెంలో నీట మునిగిన పంటపొలాలు

ముంచిన వాన



పెరవలి: కానూరు వద్ద సముద్రాన్ని తలపిస్తున్న వరి చేలు

- నీట మునిగిన వరి పొలాలు
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- ఎర్రకాలువ ప్రాజెక్టు నుంచి భారీగా వరద నీరు
- ఇబ్బందులు ఎదుర్కొన్న వాహనదారులు
- ముంపు ప్రాంతాల్లో పర్యటించిన మంత్రి దుర్గేష్, జిల్లా కలెక్టర్ ప్రశాంతి, ఎమ్మెల్యే ముప్పిడి, సబ్ కలెక్టర్ శ్రీవాస్తవ

కొవ్వూరు, జూలై 19: అల్పపీడన ప్రభావంతో శుక్రవారం కూడా ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. బుధవారం అర్ధరాత్రి ప్రారంభమైన వాన కొనసాగింది. జనజీవనం స్తంభించింది. రహదారులు, పంట పొలాలు జలమయమై చెరువులను తలపించాయి. వరి నాట్లు పూర్తిగా మునిగిపోయాయి. కొన్నిచోట్ల రహదారులు ధ్వంసం కాగా మరికొన్ని చోట్ల రోడ్లకు గండి పడి ఇతర గ్రామాలతో సంబంధాలు తెగిపోయాయి. రాకపోకలు నిలిచిపోయాయి. మురుగుకాలువలు పొంగి రోడ్లపై ప్రవహించాయి. వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. రోజువారి కూలి పనులకు వెళ్లే వారంతా ఇళ్లకే పరిమితమయ్యారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, కార్యాలయాలకు వెళ్లే సిబ్బంది వర్షంతో ఇక్కట్లను ఎదుర్కొన్నారు. కొవ్వూరు మండలం మద్దూరులంక గ్రామంలో వరద పరిస్థితిని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ, అధికారులతో కలిసి పరిశీలించారు. అలాగే కొవ్వూరు 1వ వార్డు శ్రీరామకాలనీ, రాజీవ్ కాలనీలలో ముంపుకు గురయిన రోడ్లు, డ్రైన్లు, పంటపొలాలను ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ పరిశీలించారు. వర్షపు నీరు బయటకు పోయే విధంగా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక పారిశుధ్య పనులు, దోమల నివారణకు చర్యలు చేపట్టాలని ప్రజలు ఎమ్మెల్యేను కోరారు. కొవ్వూరు మండలం మద్దూరులంక గ్రామంలో వరద ఉధృతిని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పరిశీలించారు. అనంతరం కొవ్వూరు, నందమూరు, పశివేదల గ్రామాల్లో ముంపుకు గురయిన ప్రాంతాల్లో పర్యటించారు. కొవ్వూరులో లేఅవుట్ 3 వద్ద నందమూరు-పశివేదల కాలువలో పేరుకుపోయిన గుర్రపుడెక్కను ఎమ్మెల్యే స్వయంగా తొలగించారు. నందమూరు జంక్షన్ నుంచి పశివేదల వరకు కాలువలో పూడుకుపోయిన గుర్రపు డెక్కను ప్రొక్లెయినర్ల సాయంతో తొలగించే కార్యక్రమాన్ని చేపట్టామని ఆయన చెప్పారు. ఇళ్ల స్థలాలిచ్చాం, నిర్మాణానికి రూ.1.80 లక్షలు ఇచ్చామని వైసీపీ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుందని, కాని లేఅవుట్‌లోని ప్రజలకు కనీసం తాగునీరు లేదు, సరైన విద్యుత్ సౌకర్యం లేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ట్రాన్స్‌ఫారమ్‌లు, ట్యాంకర్ల ద్వారా తాగునీరు ఏర్పాటుచేశామన్నారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో డ్రైన్లు పూడికలు, గుర్రపుడెక్క తొలగించక పోవడంతో నియోజకవర్గంలో వేలాది ఎకరాల పంట పొలాలన్నీ ముంపుకు గురయ్యాయన్నారు. నీరు బయటకు పోయే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పంట నష్ట పోయిన రైతులకు నష్ట పరిహారం అందించేందుకు ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామన్నారు. వర్షాలకు పంట ముంపుకు గురై నష్టపోయిన రైతులను అన్నివిధాల ఆదుకుంటామని ఎమ్మెల్యే అన్నారు. ఎమ్మెల్యే వెంట ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంటమణి రామకృష్ణారావు, మద్దిపట్ల శివరామకృష్ణ, దాయన రామకృష్ణ, మున్సిపల్ కమిషనర్ కె.డానియేల్ జోసఫ్, సూరపనేని చిన్ని, ఎంపీపీ కాకర్ల నారాయుడు, వట్టికూటి వెంకటేశ్వరరావు, కంటిపూడి శ్రీనివాస్, కంటిపూడి గోపిచంద్, బేతిన నారాయణ, యలమర్తి రాంబాబు ఉన్నారు.

నిడదవోలు: భారీ వర్షాలకు కొమ్మువారిగూడెం నుంచి ఎర్రకాలువ ప్రాజెక్ట్ నుంచి వరద నీటిని దిగువ ప్రాంతాలకు విడిచిపెట్టడంతో నిడదవోలు మండలం కంసాలిపాలెం, రావిమెట్ల, తిమ్మరాజుపాలెం, తీరుగూడెం, శింగవరం గ్రామాల్లో పంటపొలాలను వరదనీరు ముంచెత్తింది. మరో పక్క భారీ వర్షాలతో ఎర్రకాలువ వరదనీటితో గ్రామాల్లోని పొలాలు, రోడ్లు, డ్రైనేజీలు పొంగి పొర్లుతున్నాయి. గ్రామాల మధ్య రోడ్లు చెరువులుగా మారిపోయాయి. అలాగే శింగవరం, తాళ్లపాలెం గ్రామాల మధ్య ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద ఎర్రకాలువ వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రెండు గ్రామాల మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ప్రతినిత్యం నిడదవోలు నుంచి తాడేపల్లిగూడెం వెళ్లే వారు శింగవరం-తాళ్లపాలెం రైల్వే అండర్ బ్రిడ్జి మీదుగా రాకపోకలు సాగిస్తుండేవారు.

చాగల్లు: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలో సుమారు ఆరు వందల ఎకరాల్లో వరి పంట నీటమునిగింది. ఊనగట్ల, కలవలపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పర్యటించి రైతులతో మాట్లాడి నష్టం వివరాలు అడిగి తెలుసుకున్నారు. పైనుంచి వచ్చే వరద నీటితో పంట చేలు మునిగిపోయాయని రైతులు చెప్పారు. దీంతో పంట నష్టం అంచనాలు తయారు చేసి అందజేయాలని ఎమ్మెల్యే అధికారును ఆదేశించారు. కాలువల్లో ముంపునీరు నిలిచిపోకుండా ప్రొక్లెయిన్ల సహాయంతో తూడు, ఇతర అడ్డంకులు తొలగించాలని ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట ఏఎంసీ మాజీ చైర్మన్ ఆళ్ల హరిబాబు, నాయకులు నందిగం శ్రీనివాసరావు, బొల్లిన శివనాగేంద్ర, చినబాబు, నందిగం విష్ణు, తహశీల్దార్ సావిత్రి, ఎంపీడీవో ఎస్.బుజ్జి, వ్యవసాయ అధికారి కె.వేణుగోపాలక్రిష్ణ పాల్గొన్నారు.



ఉసులుమర్రు స్టాక్ పాయింట్ వద్ద అధ్వానంగా ఉన్న బాట



దేవరపల్లి, పల్లంట్ల బ్రిడ్జి పైన నిలిచిన వర్షపునీరు



పెరవలి: ఉధృతంగా ప్రవహిస్తున్న నిడదవోలు-నరసాపురం కాలువ

తాళ్లపూడి: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కాలువలు పొంగి పొర్లుతున్నాయి. మండలంలోని పోచవరం-తాడిపూడి రహదారిలో కాలువలు పొంగి ప్రవహిస్తుండ డంతో రాకపోకలు నిలిచిపోయాయి. పెద్దేవం, తిరుగుడు మెట్ట గ్రామాల మధ్యలో కాలువ నీరు ప్రమాదభరి తంగా ప్రవహిస్తోంది. అటు వర్షం నీరు ఇటు పొంగుతున్న కాలువ నీటితో పంట పొలాలన్నీ కనుచూపు మేరలో చెరువులను తలపిస్తున్నాయి. తిరుగుడుమెట్ట గ్రామంలో జిల్లా గ్రామ పంచాయతీ అధికారి, ప్రత్యేకాధికారి డి.రాంబాబు పర్యటించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ఆయనతో స్థానిక రైతులు మాట్లాడుతూ ఎకరాకు సుమారు రూ.10 వేలు పెట్టుబడి పెట్టామని, పంటంతా నీటలో మునిగి పోయిందని వాపోయారు. వ్యవసాయాధికారి రుచిత మాట్లాడుతూ మండలంలో ఇప్పటి దాకా 760 ఎకరాలు ముంపుకు గురైనట్లు తెలిపారు. ప్రత్యేకాధికారి వెంట ఎంపీడీవో వెంకటరమణ ఉన్నారు.

దేవరపల్లి: రెండురోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో దేవరపల్లి, పల్లంట్ల మధ్యలో పోలవరం, తాడిపూడిపై నిర్మించిన బ్రిడ్జి వద్ద వర్షపునీరు భారీగా చేరటంతో దేవరపల్లి, పల్లంట్ల మధ్య రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. బ్రిడ్జి దిగువ భాగంలో ఉండడం వల్ల రెండు వైపుల నుంచి వర్షపు నీరు రావడంతో వంతెన పైకి మట్టి కొట్టుకురావడం, ఇరువైపులా మట్టికొట్టుకు పోవడంతో పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దేవరపల్లి, దుద్దుకూరు మధ్య పోలవరం కాలువపై నిర్మించిన వంతెనపై కూడా భారీగా వర్షపునీరు నిల్వ ఉంటోంది. బ్రిడ్జి పైనుంచి నీరు వెళ్లే మార్గం లేక మట్టి పేరుకుపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షపునీరు ఇలానే ఉంటే బ్రిడ్జికి కూడా ప్రమాదం వాటిల్లే ప్రమాదముందని, అధికారులు వంతెనపై ఉన్న మట్టిని తొలగించి నీరు నిల్వ లేకుండా చూడాలని వాహనచోదకులు, ప్రజలు కోరుతున్నారు. వర్షాల ధాటికి మండలంలోని 1560ఎకరాల్లో వరినాట్లు ముంపునకు గురయ్యాయి. గౌరీపట్నం, త్యాజంపూడి, కురుకూరు, దుద్దుకూరు, యర్నగూడెం, కృష్ణంపాలెం, బంధపురం, యాదవోలు గ్రామాల్లో వరి పొలాలు నీట మునిగాయి. రెవెన్యూ, వ్యవసాయా శాఖాధికారులు ముంపుకు గురైన ప్రాంతాలను సందర్శించి మునిగిన ప్రాంతాలను పరిశీలిస్తున్నారు. కొవ్వాడ కాలువ, యర్ర కాలువ పొంగి ప్రవహిస్తుండడంతో మండలంలో గౌరీపట్నం, త్యాజంపూడి గ్రామాలు వరినాట్లు ముంపునకు గురైనట్లు వ్యవసాయాధికారి విజయ్ తెలిపారు. అలాగు తాడిపూడి కాలువ పొంగి ప్రవహించడంతో యర్నగూడెం, సుబ్బరాయపురం మధ్యలో తాడిపూడి కాలువకు గండి పడింది. దీంతో యర్నగూడెం, సూర్యనారాయణపురం, త్యాజంపూడి గ్రామాల్లో వరినాట్లు మరింత ముంపుకు గురయ్యాయి. ఆర్ఐ వెంకటేష్, వీఆర్వోలు, ఇరిగేషన్ అధికారులు సందర్శించి గండి పూడ్చడానికి చర్యలు చేపట్టారు.

పెరవలి: భారీ వర్షాలకు మండలంలోని పంట భూములు, గ్రామాల నుంచి పిల్ల కాలువలు ద్వారా నీరు నిడదవోలు-నరసాపురం కాలువలోకి చేరుకుంటుంది. ఈ కాలువకు విజ్జేశ్వరం బ్యారేజీ వద్ద నీటి విడుదల నిలుపుదల చేయకపోవడంతో మురుగునీరు సక్రమంగా వెళ్లక పంటలు నీట మునిగిపోవడంతో దెబ్బతింటాయని కానూరు, కానూరు అగ్రహారం, ఉసులుమర్రు, పెరవలి గ్రామాల్లోని రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కానూరులోని ఇందిరమ్మ కాలనీ, వైఎస్ఆర్ కాలనీల్లో నీరు నిలిచిపోయింది. మురుగు డ్రెయిన్‌ల నుంచి నీరు ప్రవహించడంతో కాలనీ వాసులు కనీసం నడిచి వెళ్ళేందుకు కూడా వీలు లేని పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వం ఈ కాలనీలను నిర్లక్ష్యంగా వదిలి వేయడంతో సరైన డ్రెయిన్‌లు, రోడ్లు సౌకర్యం లేక ప్రస్తుతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. నడిపల్లి కోటలో నెంబర్-2 పాఠశాలలో నీరు చేరడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. కానూరు, నడిపల్లికోట రహదారి గోతుల్లో నీరు నిలిచి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇదిలా ఉండగా ముక్కామల, ముమ్మిడివారిపాలెం గ్రామాల్లో ఏటిగట్టు ప్రాంతాలను ఖండవల్లి, పెరవలి పశువైద్యులు సల్మా, చరణ్ ఫణీంద్ర పరిశీలించారు. పాడి రైతులను కలుసుకుని గోదావరిలో లంక భూముల్లో ఉన్న పశువులను మెరక ప్రాంతాలకు తరలించాలని సూచించారు. వ్యాధి నిరోధక టీకాలు వేయించాలన్నారు. పశువులకు ఏదైనా ఇబ్బంది వస్తే తమను సంప్రదించాలన్నారు.

గోపాలపురం: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న వరదనీటితో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ముఖ్యంగా కొవ్వాడ కాలువ నుంచి ప్రవహిస్తున్న వరదనీరు చిట్యాల, చెరుకుమిల్లి, వెంకటాయపాలెం గ్రామాల్లో వరినాట్లు, చెరుకు తోటలను ముంచెత్తింది. మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు, ఎంపీడీవో కె.రమేష్, టీడీపీ మండలాధ్యక్షుడు రొంగల సత్యనారాయణ ముంపు ప్రాంతాలు పరిశీలించి వరదనీరు లోతట్టు ప్రాంతాలకు ప్రవహించేలా యంత్రాల సాయంతో నక్కిర్లమ్మ చెరువు వద్ద తూముల పరిసరాల్లోని చెత్తాచెదారాన్ని తొలగించారు. అనంతరం వ్యవసాయాధికారి రాజారావుతో కలిసి చెరుకుమిల్లి, వెంకటాయపాలెం, చిట్యాల, భీమోలు రెవెన్యూ పరిధిలో నీటమునిగిన పంటపొలాలను పరిశీలించారు.

ఉండ్రాజవరం: ఎడతెరిపి లేని వర్షంతో మండలంలో 800హెక్టార్లలో వరి నాట్లు నీట మునిగాయి. ఉండ్రాజవరంలో పొలాలకు వెళ్లే పుంతరోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. పసలపూడి, కాల్ధరి, మోర్త, ఉండ్రాజవరం గ్రామాల్లో వరిచేలు ఎక్కువశాతం మునిగాయి. ఎర్రకాలువ ఉధృతంగా రావడంతో గట్లు బలహీనంగా ఉన్న చోటు నుంచి సూర్యారావుపాలెం, పసలపూడి, కాల్ధరి గ్రామాల్లో కాలువ పక్కనే ఉన్న వరిచేలు మునుగుతున్నాయి. నీట మునిగిన వరి చేలను తహశీల్దార్ కె.నవీన్‌కుమార్, వ్యవసాయాధికారి ఎం.విశ్వానరావు పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు.

వరద బాధితులకు అండగా ఉంటాం

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

నల్లజర్ల, జూలై 19: ఎర్ర కాల్వ ముంపు ప్రాంతాలను అనంతపల్లి, చోడవరం గ్రామాను కలెక్టర్ ప్రశాంతి శుక్రవారం పరిశీలించారు. జంగారెడ్డిగూడెం కొంగువారిగూడెం ప్రాజెక్ట్ నుంచి ఉధృతంగా ప్రవాహిస్తున్న ఎర్ర కాల్వ నల్లజర్ల మండలంలోని పోతిరెడ్డిపాలెం, పోతవరం, కవులూరు, నబీపేట, అనంతపల్లి, చోడవరం, గుండేపల్లి గ్రామాల మీదుగా ప్రవాహిస్తోంది. అనంతపల్లి వద్ద 4మీటర్లుగా నమోదైన ఎర్ర కాల్వ అనంతపల్లి, చోడవరం, గుండేపల్లి గ్రామాల్లో ప్రమాదం పోంచి ఉందని గ్రహించిన అధికారి కాలనీ వాసులను అప్రమత్తం చేశారు. ఎంపీపీ స్కూల్‌లో పునరావస కేంద్రాలను ఏర్పాటు చేశారు. 13 కుటుంబాలకు చెందిన 87 మందిని పునరావస కేంద్రాలకు తరలించారు. 399 మంది రైతులకు చెందిన 405 ఎకరాలు నీట మునిగినట్లు గుర్తించారు. పునరావస కేంద్రాల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా అన్ని సదుపాయలను కల్పించాలని అధికారులకు ఆదేశించారు. నల్లజర్ల అనాథ హాస్టల్ నీట మునిగిపోవడంతో విద్యార్థులకు ఎంపీపీ స్కూల్‌లో తాత్కాలిక వసతి కల్పించాలని పేర్కొన్నారు. నల్లజర్ల మండలంలో 750 ఎకరాలు నీట మునిగాయని ఏవో కమల్ రాజ్ కలెక్టర్‌కు విన్నవించారు. చోడవరంలో కలెక్టర్ ప్రశాంతికి స్థానిక రైతు తొంటా శ్రీనివాసరావు తన గోడు వెల్లబోసుకున్నాడు. గ్రామంలో కౌలు పొలం తీసుకుని 7ఎకరాల వరి పంట వేయగా వరద నీటికి ముంపుకు గురైనట్లు పేర్కొన్నారు. ఎకరానికి రూ.10 వేలు చొప్పున పెట్టుబడ పెట్టానని వరద నీటికి మూడు రోజుల నుంచి పంట మునిగిపోయి పాడైపోయిందని, నష్టపరిహారం అందించాలని కోరాడు. ఇదిలా ఉండగా పోతవరంలో నీట మునిగిన ప్రాంతాలనుటీడీపీ నాయకుడు ఏలేటి సత్యనారాయణ(జేడీ) పరిశీలించారు. ముంపునకు గురైన పంటలు, ఇళ్ళకు నష్ట పరిహారం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఉధృతంగా గోదావరి

సముద్రంలోకి 3,46,391 క్యూసెక్కులు

ధవళేశ్వరం, జూలై 19: గోదావరి పరివాహక ప్రాంతాల్లో విస్తారంగా కురుస్తున్న వర్షాల కారణంగా వరద ప్రవాహం గోదావరిలో కలుస్తుండడంతో గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎగువ నుంచి వరద నీరు వస్తుండడంతో కాటన్ బ్యారేజ్ వద్ద శుక్రవారం ఉదయం 175 గేట్లను 70మిల్లీమీటర్ల మేర ఎత్తి నీటిని దిగువకు విడుదల చేసిన అధికారులు సాయంత్రానికి ఒక మీటరు పైకి ఎత్తి 3,46,391క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. దీంతో ధవళేశ్వరం వద్ద నీటి మట్టం 7అడుగులుగా నమోదయింది. ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు గోదావరికి చేరుతుండడంతో ధవళేశ్వరం వద్ద నీటి మట్టం మరింత పెరిగి మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయిలో ప్రవహించవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఎగువున భద్రాచలం వద్ద 26అడుగుల వరకు వేగంగా పెరిగిన నీటి మట్టం ఆపై నెమ్మదించి శుక్రవారం సాయంత్రానికి 26.80అడుగులకు చేరుకుంది. ప్రస్తుతం పెరుగుదల నెమ్మదించినా ఎగువ నుంచి వస్తున్న వరద నీటితో 40 అడుగులకు పైగా నీటి మట్టం పెరగవచ్చని అధికారుల అంచనా.



పెరవలి: ముక్కామలలో రైతులకు సూచనలు చేస్తున్న పశువైద్యులు



ఉండ్రాజవరంలో మునిగిన చేలను పరిశీలిస్తున్న తహశీల్దార్ నవీన్‌కుమార్



కొవ్వూరులో నీట మునిగిన జగనన్న కాలనీ లేఅవుట్-3

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొవ్వూరు, జూలై 19: కొవ్వూరులో శనివారం ఉదయం 8గంటల నుంచి 10గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు విద్యుత్‌శాఖ ఈఈ బి.వీరభద్రరావు తెలిపారు. కొవ్వూరు సబ్‌స్టేషన్ పరిధిలోని 33కేవీ ఎస్ఎస్ కొవ్వూరు, వాడపల్లి, పుష్కరఘాట్, పశివేదల, దొమ్మేరు, ఆరికిరేవుల, కుమారదేవం సబ్‌స్టేషన్లు వార్షిక మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు చెప్పారు.

విద్యార్థులకు గొడుగులు పంపిణీ

ఉండ్రాజవరం, జూలై 19: మండలంలోని మోర్త గ్రామంలో నెం.1, నెం.2, పాఠశాలల విద్యార్థులు, ఉండ్రాజవరంలోని నెం.4 పాఠశాల విద్యార్థులు 75మందికి పాలంగి గ్రామంలోని నెం.2 పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.పరమపావని శుక్రవారం గొడుగులు పంపిణీ చేశారు. వర్షాకాలంలో అవసరమైన గొడుగులు అందజేయడం పట్ల ఆమెను ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

శాకాంబరిగా కనకదుర్గమ్మ

ఉండ్రాజవరం, జూలై 19: మండలంలోని పాలంగి గ్రామంలో కనకదుర్గమ్మకు శుక్రవారం ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. అమ్మవారిని పలు రకాల కూరగాయలతో శాకాంబరిగా అలంకరించారు. భక్తులు పూజలు చేశారు. అనంతరం భజన కార్యక్రమాలు నిర్వహించారు.

వాహనం ఢీకొని ఎద్దుకు గాయాలు

కొవ్వూరు, జూలై 19: కొవ్వూరులో గురువారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని ఎద్దుకు గాయాలయ్యాయి. 9,10 వార్డుల కౌన్సిలర్లు, పిల్లలమర్రి మురళీకృష్ణ, బత్తి నాగరాజు, శానిటరి మేస్త్రీ రాజాన అప్పారావు పశు వైద్యులకు సమాచారం అందించి చికిత్స చేయించారు.

హాస్టళ్ల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ

జిల్లా సాంఘిక సంక్షేమశాఖాధికారి సందీప్



కొవ్వూరులో ఎస్సీ హాస్టల్‌ను పరిశీలిస్తున్న సందీప్

కొవ్వూరు, జూలై 19: వసతి గృహాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తుందని జిల్లా సాంఘిక సంక్షేమశాఖాధికారి ఎం. సందీప్ అన్నారు. శుక్రవారం కొవ్వూరు క్రిస్టియన్‌పేటలో శిదిలావస్థకు చేరుకున్న సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాన్ని పరిశీలించారు. హాస్టల్‌లోని రికార్డులను తనిఖీచేశారు. హాస్టల్ వార్డెన్ ముప్పిడి రాజు వసతి గృహ పరిస్థితిని వివరించారు. భవనం మొత్తం పెచ్చులూడి పోతుందని విద్యార్థుల భద్రత దృష్ట్యా స్థానికంగా మండల ప రిషత్ ప్రాథమిక పాఠశాల పై అంతస్తులో తాత్కాలికంగా రాత్రి పూట బస చేస్తున్నారన్నారు. సందీప్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 15 వసతి గృహాలలో మరమ్మత్తులు, అత్యవసర పనులకు సంభందించి అంచనాలను సిద్ధం చేశామన్నారు. కొవ్వూరు హాస్టల్ భవనం నిర్మాణానికి గతంలో రూ. 3 కోట్లతో ప్రతిపాదనలు తయారుచేయడం జరిగిందన్నారు. శుక్రవారం సమిశ్రగూడెం, ఉండ్రాజవరం, కానూరు, కొవ్వూరు బాలికల వసతిగృహాలను తనిఖీ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యూవో మేరిమాత, వసతి గృహ అధికారులు ముప్పిడి రాజు, శ్రీలత, రిటైర్డ్ వసతిగృహ అధికారి పెనుమాక జయరాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో డ్రైడే కార్యక్రమాలు

ఉండ్రాజవరం, జూలై 19: మండలంలో శుక్రవారం పలు గ్రామాల్లో డ్రైడే ఫ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాలంగిలో కాచి చల్లార్చిన నీరు తాగాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్య, పంచాయతీ సిబ్బంది ప్రజలకు వివరించారు. డెంగీ ఫీవర్, మలేరియా, టైఫాయిడ్ జ్వరాలు రాకుండా తీసుకునే చర్యలు చెప్పారు. పారిశుధ్య పనులను చేయించారు. ప్రజలకు పారిశుధ్యం, సీజనల్ వ్యాధుల గురించి వివరించే ప్రభుత్వ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బొక్కా శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి మహ్మద్ హసన్‌జాని, వైద్య సిబ్బంది జి.శ్రీనివాస్, కాపా నాగరాజు, ఎంఎల్‌హెచ్‌పీ బులివెంకమ్మ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన ఎస్పీ

రాజమహేంద్రవరం, జూలై 19(ఆంధ్రజ్యోతి): పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల లక్ష్మీ దుర్గేశ్ ప్రసాద్‌ని నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్పీ డి.నరసింహ కిషోర్ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాలోని శాంతి భద్రతలపై చర్చించారు.

జిల్లా ఎస్పీని కలిసిన ఎమ్మెల్యే గోరంట్ల



రాజమహేంద్రవరం రూరల్, జూలై 19: జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన డి.నరసింహ కిషోర్‌ను ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మర్యాద పూర్వకంగా కలిశారు. శుక్రవారం జిల్లా ఎస్పీ కార్యాలయానికి గోరంట్ల వెళ్లి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. కొద్దిసేపు శాంతిభద్రతల పరిరక్షణపై చర్చించారు.

క్రీడా కేంద్రంగా రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరాన్ని క్రీడా కేంద్రంగా మారుస్తామని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. ఆగస్టు 10,11 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్ చాంపియన్ షిప్ పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం రాజమహేంద్రవరంలోని గోరంట్ల నివాసంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆగస్టు 10,11 తేదీల్లో రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల గ్రౌండ్స్‌లో 31వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలు జరుగుతాయని, విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం చీఫ్ ఆర్గనైజర్ ఎం.గణేష్, ఎస్.గిరివెంకటరమణ మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న క్రీడాకారులకు వసతి, భోజన సదుపాయాలు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో కిక్ బాక్సింగ్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

కొవ్వూరు

యువరాజ్‌మాల్ వై.స్క్రీన్1	కల్కి
వై.స్క్రీన్2	భారతీయుడు-2
దేవిశ్రీ(గాయత్రి: ప్రభుత్వ జూనియర్ కళాశాల	
అనన్య	భారతీయుడు-2

నిడదవోలు

వీ మ్యాక్స్	---
రాధాకృష్ణ	కల్కి
శ్రీగణపతి	భారతీయుడు-2

దేవరపల్లి

శ్రీరామ్ సినీ మ్యాక్స్	కల్కి
శ్రీరామ్ సినీ మ్యాక్స్	కల్కి

నల్లజర్ల

శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్ స్క్రీన్1	భారతీయుడు-2
స్క్రీన్ 2	కల్కి
శ్రీనివాస	---